

## విరబూసిన బ్రహ్మ కమలం పుష్పాలు



స్థానిక రాజులవీధిలో కాద సన్యాసిరాజు ఇంటి మేడపై ఆదివారం వేకువజామున బ్రహ్మ కమలం పుష్పాలు విరబూశాయి. ఈ పుష్పాలు తొలి ఏకాదశి రోజున పూయడంతో వీటిని ఆలయానికి ఇచ్చినట్టు అతని కుటుంబ సభ్యులు తెలిపారు. - దేవరాపల్లి/ఆంధ్రజ్యోతి

# విశాఖలో ఓపెన్‌గా భూ దందా

- మొన్న మధురవాడ, ఇప్పుడు కోటనరవ జీవీఎంసీ 88వ వార్డు పరిధిలో ఓపెన్ స్పేస్ ధారాదత్తం

**వైసీపీ హయాంలో ప్రతిపాదన**

- కూటమి హయాంలో ఆమోదం
- ఈడబ్ల్యూఎస్ లేఅవుట్ వెనుక 12 ఎకరాల భూమి
- అందులో లేఅవుట్ వేసేందుకు కూటమి నేత ప్రణాళిక
- ఆ భూమికి రోడ్డు సదుపాయం లేకపోవడంతో తక్కువ ధరకు రైతుల నుంచి కొనుగోలుకు ఒప్పందం
- ఆ భూమి ముందున్న ఓపెన్‌స్పేస్‌లో 180 గజాలు తమకు ఇస్తే అంతే స్థలాన్ని జీవీఎంసీకి బదలాయిస్తామంటూ రైతు ద్వారా దరఖాస్తు
- ఈ ఏడాది మార్చిలో భూ మార్పిడికి ప్రభుత్వం అనుమతి





ఓపెన్‌స్పేస్ వెనుక ఉన్న భూములు. (ఇన్‌సెట్‌లో) ఓపెన్‌స్పేస్‌లో ఏర్పాటుచేసిన బోర్డు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

**విశాఖలో పార్కులు /ఓపెన్‌స్పేస్‌లను గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేస్తున్నారు. వాటి వెనుక భూములు కలిగి వున్నవారు స్థానిక ప్రజా ప్రతినిధుల ద్వారా పైరవీలు చేసుకుని విలువైన జీవీఎంసీ భూమిని చేజిక్కించుకుంటున్నారు. తద్వారా రహదారి సదుపాయం లేక నిరుపయోగంగా ఉన్న తమ భూములకు విలువ పెంచుకుని భారీగా లబ్ధిపొందుతున్నారు. మధురవాడ జోన్-2 బటర్‌ఫ్లై పార్కులోని 489 గజాల జీవీఎంసీ స్థలాన్ని ప్రైవేటువ్యక్తికి బదలాయించిన విషయం ఇటీవల బయటపడగా, తాజాగా 88వ వార్డు పరిధిలో జీవీఎంసీకి చెందిన ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాలను ప్రైవేటు భూమికి రహదారి నిర్మాణం నిమిత్తం బదలాయించిన విషయం వెలుగులోకి వచ్చింది. దీని వెనుక కూడా కూటమికి చెందిన ఒక ప్రజా ప్రతినిధి చక్రం తిప్పారని ప్రచారం జరుగుతోంది.**

జీవీఎంసీ జోన్-6 పరిధి కోటనరవలో సర్వే నంబరు 10-9బిలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) కోసం 1981లో లేఅవుట్ వేశారు. లేఅవుట్‌లోని ప్లాట్లన్నింటిలోనూ భవన నిర్మాణాలు జరిగిపోయాయి. లేఅవుట్ మధ్య కోటనరవ నుంచి షీలానగర్ వెళ్లే రోడ్డు ఉంది. ఆ రోడ్డును అనుకుని సుమారు 450 గజాలను ఓపెన్‌స్పేస్ కింద విడిచిపెట్టారు. ఆ స్థలం ఇప్పటికీ ఖాళీగానే ఉంది. అందులో ఆక్రమణలు జరగడంతో పెందుర్తి తహశీల్దార్ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఇదిలావుండగా లేఅవుట్‌కు ఉత్తరం వైపు సుమారు 20 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. రైతులు ఆ భూముల్లోకి వెళ్లాలంటే ఓపెన్‌స్పేస్‌కు తూర్పు వైపున గల ఇళ్ల కోసం నిర్మించిన పది అడుగుల రహదారి ఒక్కటే మార్గం. ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌తోపాటు నరవ-షీలానగర్ రోడ్డును అనుకుని ఉన్న స్థలాలన్నీ అభివృద్ధి చెందాయి. లేఅవుట్‌కు ఉత్తరభాగంలో ఉన్న వ్యవసాయ భూములు కూడా నివాసాలు, వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుకూలంగా ఉన్నప్పటికీ రోడ్డు సదుపాయం లేకపోవడంతో ఖాళీగా ఉండిపోయాయి. లేఅవుట్‌లో ఓపెన్‌స్పేస్‌గా కేటాయించిన స్థలంలో కొంతభూమిని తీసుకుని ప్రస్తుతం ఉన్న పది అడుగులు రోడ్డును 40 అడుగులకు విస్తరిస్తే వ్యవసాయ భూముల్లో బహుళ అంతస్థుల

... మిగతా 6వ పేజీలో

# విద్యార్థుల చేరికలో వెనుకబడి

**ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్య**

- గత వైసీపీ ప్రభుత్వం అస్తవ్యస్త నిర్ణయాలే కారణం
- కూటమి సర్కారు వచ్చినా మారని పరిస్థితి
- మండలంలోని 12 స్కూళ్లలో పది మందిలోపే బాలలు



లక్కవరంలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

చోడవరం, జూలై 6(ఆంధ్రజ్యోతి):

**విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, బూట్లుతో పాటు తల్లికి వందనం పేరుతో ఏడాదికి ఒక విద్యార్థికి రూ.13 వేలు ఇస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలల విలీనం పేరుతో రేపిన చిచ్చుతో కుదేలైన ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి.. కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయినా ఇంకా మారలేదు.**

మండలంలోని 46 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గాను 12 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పదికి లోపు ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చాలా వరకు చక్కని వసతితో పాటు ఉపాధ్యాయులు కూడా అందుబాటులోనే ఉన్నారు. అయినప్పటికీ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏమంత గొప్పగా లేకపోవడం గమనార్హం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పరిశీలిస్తే, గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న బడుల విలీనం ప్రభావం ఇప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై కనిపిస్తున్నదనే చెప్పాలి. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న అస్తవ్యస్త నిర్ణయాలను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చాలా వరకు ప్రాథమిక పాఠశాలలకు ఊపిరిపోసే చర్యలు చేపట్టింది. గతంలో హైస్కూళ్లలో విలీనం చేసిన మూడు, నాలుగు, ఐదు తరగతులను తిరిగి వెనక్కి పంపించింది. ఒకటి, రెండు తరగతి చిన్నారుల కోసం కొత్తగా ఫౌండేషన్ స్కూళ్లను కూడా ఏర్పాటు చేసింది. అలాగే హైస్కూళ్లలో కూడా ఒకటి నుంచి ఐదు వరకు తరగతులు ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం ఇంత చేసినా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మండలంలోని జి.జగన్నాథపురం, గవరవరం, లక్కవరం, కోమటివీధి, సింహాద్రిపురం, జుత్తాడ, చందకవీధి, దుద్దుపాలెం, గోవాడ, ముద్దుర్తి, అంబేరుపురం పాఠశాలలు కేవలం పదిలోపు విద్యార్థులతోనే నడుస్తున్నాయి. మండలంలోని లక్కవరం స్కూల్‌లో ఇద్దరు, గవరవరంలో ఐదుగురు, సింహాద్రిపురంలో ముగ్గురు, దుద్దుపాలెంలో నలుగురు ఉండగా, మిగిలిన చోట ఐదుగురు, ఎనిమిది మంది చొప్పున ఉన్నారు. ప్రభుత్వం లక్షలాది రూపాయలు విద్యారంగంపై ఖర్చు పెడుతున్నా, తల్లిదండ్రులు మాత్రం దూరమైనా ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దే చర్యలు పూర్తిస్థాయిలో చేపట్టడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే తల్లికి వందనం పథకం అమలుచేస్తే తప్పా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలకు మునుపటి కళ రాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# 24 వేల యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం

- జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు



శునకానికి టీకా వేస్తున్న సిబ్బంది. పక్కన ఆర్డీవో, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి, తదితరులు

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో 80 పశు సంవర్ధకశాఖ ఆస్పత్రుల్లో 24 వేల యాంటీ రేబిస్ టీకాలను అందుబాటులో ఉంచామని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఆదివారం స్థానిక గాంధీనగరం పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో 198 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలను సిబ్బంది వేశారు. ఆర్డీవో షేక్ ఆయీషా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, సిబ్బంది పెంపుడు జంతువుల యజమానులకు వివిధ జూనోటిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు మాట్లాడుతూ సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు మంత్రి పార్థసారథి పర్యటన

- మాడుగులలో డీసీసీబీ రుణాల పంపిణీ

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) :

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థ సారథి సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8.50 గంటలకు విమానంలో విశాఖకు చేరుకోనున్న ఆయన నోవాటెల్‌కు చేరు కుంటారు. అనంతరం రోడ్డు మార్గంలో 11 గంటలకు అనకాపల్లి జిల్లా మాడు గుల చేరుకుని అక్కడ టీటీడీ కల్యాణ మండపంలో జరిగే డీసీసీబీ రుణాల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తితో కలిసి పాల్గొంటారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సత్యవరం గ్రామంలో జరిగే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పాల్గొంటారు. అనం తరం రాత్రికి విశాఖ చేరుకుంటారు.

# ఉపమాక క్షేత్రానికి తొలి ఏకాదశి శోభ

- భక్తులతో ఆలయం కిటకిట
- ఘనంగా గిరి ప్రదక్షిణ



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు (ఇన్‌సెట్‌లో) విశేష అలంకరణలో స్వామివారు

నక్కపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

ఉపమాక క్షేత్రం ఆదివారం తొలి ఏకాదశి శోభతో కళకళలాడింది. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో పోటెత్తింది. తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారి నిజరూపానికి పంచామృతాభిషేకం చేసి, ధూప, దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించిన అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతించారు. కింద ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారికి అర్చకుల బృందం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో క్యూ లైన్లన్నీ కిటకిటలాడాయి. ఆలయ ప్రధాన రాజగోపురం బయట కూడా భక్తులు క్యూ లైన్లలో వేచి వున్నారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

### ఘనంగా గిరి ప్రదక్షిణ

ఆదివారం సాయంత్రం స్వామివారు కొలువైన గరుడాద్రి పర్వతం చుట్టూ భక్తుల గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. శ్రీనివాసా భజన భక్త సమాజం భక్తులు, నక్కపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన శ్రీవారి సేవకులు, అనేక మంది మహిళా భక్తులు తరలివచ్చారు. భజన గీతాలు, గోవిందనామస్మరణతో భక్తులంతా గిరి ప్రదక్షిణ చేశారు.

# 11న వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శన

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో ఈ నెల 11న ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాల ప్రదర్శన ఏర్పాటు చేశామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ యంత్రాల ప్రదర్శనతో పాటు వాటి వినియోగం, ప్రయోజనాలు తెలియజేస్తారన్నారు. రైతులు ప్రత్యక్షంగా పరిశీలించి, వివరాలు తెలుసుకొని ప్రభుత్వం ఇచ్చే రాయితీతో కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు చుట్టుపక్కల రోలుగుంట, కోటవురట్ల, రావికమతం, కశింకోట మండలాల రైతులు కూడా ప్రదర్శనకు రావాలని కోరారు.

## శ్రీరంగనాథునిగా జగన్నాథుడు



శ్రీరంగనాథుని అవతారంలో జగన్నాథుడు

స్థానిక శ్రీకేశవస్వామి ఆలయంలో జగన్నాథుని దశ రూప మహోత్సవాల్లో భాగంగా ఆదివారం జగన్నాథస్వామి శేష పాన్పుపై శ్రీరంగనాథుని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు సుదర్శన సీతారామాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. - చోడవరం/ఆంధ్రజ్యోతి

# వాణిజ్య పన్నుల శాఖలో బదిలీలు

- జాయింట్ కమిషనర్, అసిస్టెంట్, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు స్థాన చలనం
- ఉమ్మడి జిల్లాలోని పలు సర్కిల్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీలు

విశాఖపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి):

ఉమ్మడి విశాఖ జిల్లాలోని వాణిజ్య పన్నులశాఖలో పలువురు అధికారులకు బదిలీలు జరిగాయి. జాయింట్ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు స్థానం చలనం కలిగింది. విశాఖపట్నం-2 జాయింట్ కమిషనర్ వై.కిరణ్‌కుమార్‌కు నెల్లూరు బదిలీ అయింది. అనంతపురం జాయింట్ కమిషనర్ టి.శేషాద్రిని విశాఖపట్నం-2 జాయింట్ కమిషనర్‌గా బదిలీచేశారు. ఈయనకే విశాఖపట్నం-1పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**డిప్యూటీ కమిషనర్లు బదిలీ..**

విశాఖపట్నం డివిజన్-1 పరిధిలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న సీహెచ్‌వీ రవికాంత్ చిక్కాకు రాజమహేంద్రవరం బదిలీ అయింది. విశాఖ-2 డివిజన్‌లో పనిచేస్తున్న అపర్ణ కొంపల్లికి విజయవాడ-1, విజయవాడ చీఫ్ కమిషనర్ ఆఫీస్‌లో పనిచేసే డేవిడ్ అనిల్ కుమార్‌కు విశాఖలోని వ్యాట్ ట్రిబ్యునల్ స్టేట్ రిప్రెజెంటేటివ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న వై.వెంకటేశ్వర్లును విజయవాడలోని చీఫ్ కమిషనర్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. విశాఖపట్నం డివిజన్-2 అనకాపల్లి సర్కిల్‌లో పనిచేస్తున్న దుశ్యంత్ కుమార్‌కు విశాఖపట్నం-1 సూర్యాబాగ్ సర్కిల్‌కు, ఎయిర్ పోర్టు సర్కిల్‌లో పనిచేస్తున్న పంతుల నారాయణశాస్త్రికి గుంటూరు-2 డివిజన్ పిడుగురాళ్ల సర్కిల్‌కు, గాజువాక సర్కిల్‌లో పనిచేస్తున్న మలిశెట్టి వెంకటేశ్వర్లును విజయనగరం వెస్ట్ సర్కిల్‌కు బదిలీచేశారు. అచ్యుతాపురం సర్కిల్‌లో పనిచేసే దుర్గాసి శ్వేతను విజయనగరం సౌత్ సర్కిల్‌కు, విశాఖ డివిజన్-1 పరిధిలోని పి.కృష్ణారావుకు అనకాపల్లి సర్కిల్‌కు, చినవాల్తేరు సర్కిల్‌లో పనిచేసే బీజీఎస్ ప్రసాదరావుకు కురుపాం మార్కెట్‌కు, డాబాగార్డెన్స్ సర్కిల్‌లో పని చేస్తున్న వులవకాయల నూకరాజును మాధవధార సర్కిల్‌కు బదిలీ చేశారు. కురుపాం మార్కెట్ సర్కిల్‌లో పనిచేసే రత్నాల అనసూయకు ఏలూరు బజార్ సర్కిల్‌కు బదిలీ అయింది. సిరిపురం సర్కిల్‌లో

... మిగతా 6వ పేజీలో

## పెంపుడు కుక్కలకు టీకాలు

ఎలమంచిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో 193 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. వాటి యజమానులకు ఆస్పత్రి సహాయ సంచాలకుడు డా.సీహెచ్.ఎం.ఎం. గంగాధర్ అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేసి జాగ్రత్తలు సూచించారు. జంతువుల సంతాన నిరోధక చర్యలు కొనసాగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

### దిమిలిలో ఉచిత కంటి వైద్య శిబిరం

రాంబిల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దిమిలిలో ఆదివారం 'మన ఊరు-మనవంతు సేవ' చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి నిర్వాహకులు ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. సుమారు వందమంది కళ్లను పరీక్షించి ఔషధాలు అందజేశారు. 25 మందికి శస్త్రచికిత్సలు చేయాలని గుర్తించారు. వైద్యురాలు అరుణ, క్యాంప్‌మేనేజర్ అరుణ్‌కుమార్, ట్రస్టు సభ్యులు బి.మాణిక్యం, జి.నానాజీ, బి.ప్రేమసాగర్, కె.రమేష్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### విజయవంతంగా శస్త్రచికిత్సలు

మునగపాక, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఉచిత శిబిరం ద్వారా గుర్తించినవారికి కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా చేపట్టారని మాజీ సర్పంచ్ యల్లపు వెంకట భాస్కరరావు తెలిపారు. విశాఖ శంకర్ ఫౌండేషన్‌లో కంటిశస్త్రచికిత్సలు చేయించుకున్న 55 మంది ఆదివారం స్వగ్రామమైన నాగులాపల్లికి చేరుకున్నారు. ఈ నెల 3న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, సుందరపు వెంకట సతీష్‌కుమార్‌ల సూచనల మేరకు వైద్య శిబి రం ఏర్పాటు చేశామని భాస్కరరావు తెలిపారు.

### భక్తిపాటలు పుస్తకావిష్కరణ

ఎలమంచిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని విడిదిల్లు ఆవరణలో ఆదివారం 'అమ్మ నేర్పిన భక్తి పాటలు' పుస్తకావిష్కరణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రతినిధి ఆకొండి లక్ష్మి తెలిపారు. పోణంగి సాయికృష్ణ నేర్పిన ఎన్నో పాటలు పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు.

### గోకివాడ మాజీ సర్పంచ్ మృతి

రాంబిల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గోకివాడ పంచాయతీ మాజీ సర్పంచ్ ద్వారపురెడ్డి అప్పారావు (86) ఆదివారం తెల్లవారుజామున ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మృతిచెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. సుమారు 27 సంవత్సరాలు సర్పంచ్‌గా పని చేశారు. జిల్లా ఉత్తమరైతు అవార్డు అందుకున్నారు. ఆయన అంతిమయాత్రలో పలువురు ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, అభిమానులు కన్నీటి పర్యంతమయ్యారు.

## వైభవంగా జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర


మునగపాకలో జగన్నాథుడిని దర్శించుకున్న టీడీపీ నాయకులు


పవిత్ర జలాన్ని మట్టి గోనెలుతో ఇళ్లకు తీసుకు వెళ్తున్న నిర్వాహకులు

మునగపాక, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జగన్నాథస్వామి తిరుగు ప్రయాణం వైభవంగా జరిగింది. స్థానిక ఇంద్రద్యుమ్న హాలుకు గత నెల 27న బలరామ, సుభద్ర సమేతంగా తరలి వచ్చిన జగన్నాథస్వామి ప్రధాన ఆలయానికి ప్రత్యేకంగా అలంకరించిన రథంలో గ్రామ పుర వీధుల మీదుగా తిరుగు ప్రయాణమయ్యారు. రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథుడు ఆదివారం కల్కి అవతారంలో కనిపించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, కార్పొరేషన్ల డైరెక్టర్లు బీమరశెట్టి శ్రీను, డొక్కా నాగభూషణం, జిల్లా తెలుగు మహిళ ఆడారి మంజు, మండల టీడీపీ అధ్యక్షుడు పెంటకోట విజయ్‌లు స్వామి వారిని దర్శించుకున్నారు. తిరుగు రథయాత్ర జన సంద్రాన్ని తలపించింది. జగన్నాథుడి జైగంటలతో మునగపాక, నాగులాపల్లి పురవీధులు మారుమోగాయి. పండుగ నిర్వాహకులు పూర్వీకుల కాలం నుంచి ఆచరిస్తున్న విధంగా సంతబయలు ప్రాంతంలో ఉన్న పురాతన బావి నుంచి పవిత్ర జలాలను పూజా ప్రసాదం తయారీకి తీసుకు వెళ్లారు. మట్టితో తయారు చేసిన భారీ కుండలు, గోనలుతో జలాన్ని జైగంటలతో ఇళ్లకు తీసుకు వెళ్లారు. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు బారులు తీరారు.

### ఘనంగా పూడిమడక రథయాత్ర

అచ్యుతాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పూడిమడకలో జగన్నాథుని రథయాత్ర ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు రథయాత్ర ప్రారంభమైంది. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జగన్నాథుని దర్శించుకున్నారు. కొబ్బరికాయ కొట్టి రథయాత్రకు శ్రీకారం చుట్టారు. పల్లిపేట, పాతబస్టాండ్, కొత్త బస్టాండ్ మీదుగా యాత్ర కొనసాగింది. కడపాలెం, కొండపాలెం, పల్లిపేట, పెద్దూరు, జాలారిపాలెం, ఎస్సీ కాలనీ, కొత్తూరు, లోవపాలెం, సీతపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ప్రధాన అర్చకులు పులఖండం గోపాలాచార్యులు, వంశపారంపర్య ధర్మకర్త నాగుమంత్రి గోపాలకృష్ణ కార్యక్రమాన్ని జరిపించారు.

## బాబు సుపరిపాలనతో ఏపీకి ఊపిరి

**రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు**


తిమ్మరాజుపేటలో ప్రజలను పలకరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, పప్పల చలపతిరావు, టీడీపీ ఇతర నాయకులు

మునగపాక, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో భారీగా నష్టపోయిన ఏపీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఊపిరి పోస్తున్నారని రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఒంపోలు లో ఆదివారం 'సుపరిపాలన తొలిఅడుగు'లో ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. మండల టీడీపీ అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, కార్పొరేషన్ డైరెక్టర్లు బీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కానాగభూషణం, జిల్లా తెలుగు మహిళ ఆడారి మంజు, క్లస్టర్ ఇన్‌చార్జి ఉల్లింల గోవింద, సంతోష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధి దిశగా ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. తిమ్మరాజుపేటలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించారు. విధ్వంసం నుంచి ప్రజలను వికాసం వైపు నడిపించడానికి ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు లాలం భాస్కరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మౌనం పాటించి, నివాళులర్పించారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం, రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి కర్రి సాయికృష్ణ, రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు బీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, కర్రి ఆదిబాబు, మామిడి శివ అప్పారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని పూడిమడక శివారు జాలారి పాలెంలో సీనియర్ టీడీపీ నాయకుడు మేరుగు బాపునాయుడు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలందించారు.

ఎలమంచిలి : హామీలు అమలు చేస్తూ, రెట్టింపు అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ నేతలు గొర్లె బాబూరావు, కరణం రవికుమార్‌లు అన్నారు. ఆదివారం 24వ వార్డు రామారాయుడు పాలెంలో స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఇంటింటా తిరిగి ఏడాదిలో ప్రభుత్వం ప్రజలకు చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు.

రాంబిల్లి : ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం దూసుకుపోతోందని టీడీపీ మండల యువనేత చెల్లూరి ఆనంద్ అన్నారు. ఆదివారం ఆయన జడ్చింతువా పంచాయతీ లోవపాలెంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ ఏడాది పాలన విజయాలను ప్రజలకు తెలియజేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాలు కనీస అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పనులు జోరందుకున్నాయన్నారు.

## భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు


కొత్తపేట సీతారాముల ఆలయంలో లక్ష తులసీ పూజలో పాల్గొన్న భక్తులు

ఎలమంచిలి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం ఎలమంచిలి పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లోని వైష్ణవాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భజన కీర్తనలు ఆలపించారు. కొత్తపేటలో పురాతన సీతారాముల ఆలయంలో లక్ష తులసీ పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు సమక్షంలో సాంప్రదాయ రీతిలో పూజలు నిర్వహించారు. పాతవీధి, తెరువుపల్లి, సోమలింగపాలెం, కొక్కిరాపల్లి, పెదపల్లి వార్డుల్లోని ఆలయాల్లోనూ పూజా కార్యక్రమాలు చేపట్టారు. తెరువుపల్లిలోని హనుమత్ లక్ష్మణ సమేత సీతారాములకు పూర్ణాభిషేకం నిర్వహించారు. రామ మందిరం కమిటీ పర్యవేక్షణలో అర్చక ధర్మకర్త పాణంగిపల్లి నరసింహాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు సీతారాముల నిజరూప దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏటికొప్పాక, పీఎన్ఆర్ పేట, పులపర్తి, రేగుపాలెం గ్రామాల్లో ఏకాదశి పూజలు ప్రత్యేకంగా నిర్వహించారు.

### గుర్రప్ప అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

అచ్యుతాపురం రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మల్లవరంలోని గుర్రప్ప అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు వేద పండితుల ప్రత్యేక పూజల అనంతరం ఆశీర్వాదాలు, ప్రసాదాలను స్వీకరించారు. ఆలయం అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. జనసేన పార్టీ ఉత్తరాంధ్ర వ్యవహారాల కమిటీ ఇన్‌చార్జి సుందరపు సతీష్, గ్రామ సర్పంచ్ పిన్నమరాజు వాసు, ఎం.జగన్నాథపురం సర్పంచ్ కరెడ్ల ప్రకాష్, నాయకులు ద్వారపురెడ్డి బాబ్జీ, చిన్ని శ్రీనివాసరావు, పన్నమరాజు లక్ష్మీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### నునపర్తి గ్రామ కంఠంలో నిర్మాణం అడ్డగింత


ఇంటి నిర్మాణ పనులను అడ్డుకుంటున్న గ్రామస్థులు

అచ్యుతాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ కంఠంలో నిర్మాణాన్ని నునపర్తి గ్రామస్థులు ఆదివారం అడ్డుకున్నారు. గ్రామ కంఠం సర్వే నంబరు 93లో ఒకరు ఆక్రమించి గృహనిర్మాణం చేపట్టారు. ఈ స్థలాన్ని గ్రామ అవసరాలకు అనాదిగా వినియోగిస్తున్నామని, ఇక్కడ నిర్మాణం చేపట్టకూడదని గ్రామస్థులు అభ్యంతరం తెలిపారు. అయినా రాజకీయ నాయకుల అండతో నిర్మాణాన్ని కొనసాగిస్తున్నాడు. దీనిపై గ్రామ తెలుగుదేశం అధ్యక్షుడు రెడ్డి శ్రీను, రెడ్డి ఎరుకునాయుడు కోర్టును ఆశ్రయించారు. నిర్మాణాలు ఆపాలని కోర్టు ఆదేశించినా కొనసాగిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. అధికారులకు కోర్టు నుంచి ఆదేశాలు వచ్చినా పట్టించుకోవటంలేదని ఆరోపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి నిర్మాణాన్ని ఆపాలని సూచించడంతో పనిని నిలిపివేశారు.

### ఎమ్మెల్యేతో కాంగ్రెస్ నేతల మర్యాదపూర్వక కలయిక

అచ్యుతాపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను అచ్యుతాపురంలో గల తన నివాసంలో ఎలమంచిలి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి తనకాల అనంతరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎన్వీఆర్ రాహుల్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. సెజ్ కర్మాగారాల్లో తరచూ జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని, ఇటీవల చేపల వేటకు వెళ్లి మృతి చెందిన చోడిపల్లి ఎర్రయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. 20 ఏళ్లుగా నలుగుతున్న అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులు జరగటానికి విజయకుమార్ చేసిన కృషిని వీరు అభినందించారు. రోడ్డు నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అర్హత ఉన్నా తల్లికి వందనం అందనివారికి న్యాయం చేయాలని కోరారు.



### కొళాయిల నుంచి బురద నీరు

**కాగిత గ్రామస్థుల ఆవేదన**

నక్కపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగిత గ్రామంలో గత కొన్నాళ్లగా కొళాయిల నుంచి బురద నీరు వస్తోందని పలవురు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ ఏర్పాటు చేసిన కొళాయిల నుంచి బురద నీరు వస్తోందని, దీనిని తాగితే రోగాల బారినపడుతున్నామని పార్వతి, నూకరత్నం,అమ్మాజీ అనే మహిళలు ఆదివారం తెలిపారు. ఈ విషయాన్ని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు జి.గోవింద్ పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బురద నీరు రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

### ర్యాబిస్ వ్యాధి ప్రాణాంతకం

కోటవురట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ర్యాబిస్ వ్యాధి ప్రాణాంతకమైనదని, ఇది సోకకుండా ముందస్తుగా కుక్కలకు టీకాలు వేయించడమే మంచిదని పాములవాక పశు వైద్యాధికారిణి హరిప్రియ అన్నారు. జునోసిస్ డే సందర్భంగా ఆదివారం మండలంలోని పాములవాక పశువుల ఆస్పత్రిలో ఆదివారం పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలను మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు సమక్షంలో వేశారు. డాక్టర్ హరిప్రియ ర్యాబిస్ వ్యాధి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కోటవురట్ల పశువుల ఆస్పత్రి డాక్టర్ ప్రతాప్‌కుమార్, ఎల్‌ఎ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

**పాయకరావుపేట:** జునోసిస్ డే సందర్భంగా పాయకరావుపేటలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పెంపుడు శునకాలకు ఉచితంగా టీకాలు వేశారు. బృందావనంలో ఉన్న పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయలో నిర్వహించిన కార్యక్రమంలో పలు పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఏడీ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుష్యులకు, మనుష్యుల నుంచి జంతువులకు వచ్చే వ్యాధులతో పాటు ర్యాబిస్‌పై అవగాహన కల్పించారు. అందరూ ముందు జాగ్రత్తగా తమ శునకాలకు యాంటీ ర్యాబిస్ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షులు యాళ్ల వరహాలబాబు, తదితరులు పాల్గొన్నారు.


పాయకరావుపేటలో పూజలందుకున్న పాండురంగస్వామి, అమ్మవార్లు


ఎస్.రాయవరం వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న అర్చకుడు


అడ్డరోడ్డు తిమ్మాపురంలో శాకంబరిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి

## వైభవంగా తొలి ఏకాదశి పూజలు

**» భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు**

పాయకరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పాయకరావుపేటలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పాండురంగస్వామి ఆలయంలోని పాండురంగస్వామి, ఆళ్వార్ అమ్మవార్లకు ప్రధానార్చకులు కృష్ణస్వామి ప్రత్యేక పూజలు చేయగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వికాస తరంగిణి సభ్యులు విష్ణుసహస్రనామ పారాయణాన్ని పఠించడంతో పాటు ఏకాహం నిర్వహించారు. అలాగే స్థానిక బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు ఆలయంలో అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు రాజుగారి బీడులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలను ఘనంగా జరిపారు.

**నక్కపల్లి:** మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆషాఢ రెండో ఆదివారంతో పాటు తొలి ఏకాదశి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించేందుకు తరలివచ్చారు. నక్కపల్లి సివిల్ సప్లై గొడౌన్ ఇన్‌చార్జి శ్రీపాద సత్య భాస్కరప్రసాద్, మంగ దంపతులు అమ్మవారికి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కరణం ఈశ్వరరావు, ఎస్.విజయ్‌కుమార్, గూడుపురాజులు, ఎస్.సత్తిబాబు, తదితరులు శేషవస్త్రంతో ప్రసాద్ దంపతులను సత్కరించారు. అలాగే పాయకరావుపేట నియోజకవర్గ ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి అల్లు మోహన్ అమ్మవారిని దర్శించుకున్నారు. మండలంలోని రమణయ్యపేటకు చెందిన పలువురు మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయం భక్తులతో సందడిగా కనిపించింది.

**ఎస్.రాయవరం:** మండలంలోని ఎస్.రాయవరం, దార్లపూడి గ్రామాల్లో గల వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు తదితర గ్రామాల్లో ఉన్న పలు ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి పూజలు, అభిషేకాల్లో పాల్గొన్నారు. అలాగే అడ్డరోడ్డు తిమ్మాపురంలో గల దుర్గాదేవి అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శోభాయమానంగా అలంకరించారు. శాకాంబరిగా ఉన్న అమ్మవారిని దర్శించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

### రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎస్.రాయవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం రైలు ఢీకొని సుమారు 50 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతున్న సమయంలో రాజమండ్రి వైపు నుంచి విశాఖ వస్తున్న ఓ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని, తెలుపు రంగు షర్టు, నలుపు చుక్కలతో కూడిన షార్టుతో పాటు నాగులచవితి టవల్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రి మార్చురీ గదిలో భద్రపరిచామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరికైనా మృతుడి వివరాలు తెలిస్తే 9490619020 సెల్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య


మృతుడు సతీశ్ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెటెరో ఔషధ పరిశ్రమలో పనిచేస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆదివారం నక్కపల్లి హెచ్‌సీ వెంకటరావు విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడేనికి చెందిన చింతాకుల సతీశ్ (22) హెటిరోలో కాంట్రాక్టు వెల్డర్‌గా పనిచేస్తున్నాడని, ఉపమాకలో తల్లి మంగ, కుటుంబ సభ్యులతో ఉంటున్నాడని పేర్కొన్నారు. సతీశ్‌కు మద్యం అలవాటు ఉన్నందున ఈ నెల 3న తల్లి మందలించడంతో రాత్రి మేడ మీదకు వెళ్లి గడ్డిమందు తాగాడని తెలిపారు. మేడపై వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు తక్షణమే సతీశ్‌ను నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించగా, శనివారం రాత్రి మృతి చెందినట్టు హెచ్‌సీ పేర్కొన్నారు.


పెదబోదిగల్లంలో గుమ్మటాల ఊరేగింపు

### గ్రామాల్లో మొహర్రం సందడి

నక్కపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబోదిగల్లం, చినబోదిగల్లం, పెదదొడ్డిగల్లు ముస్లిం గ్రామాల్లో ఆదివారం మొహర్రం పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా మసీదుల వద్ద ప్రార్థన చేశారు. అనంతరం గుమ్మటాల ఊరేగింపు చేపట్టారు. ఖబ్రస్థాన్ వద్ద కూడా ప్రార్థనలు చేశారు. మొహర్రం విశిష్టత గురించి మత పెద్దలు వివరించారు.

### బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

పాయకరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతిని ఆదివారం స్థానిక దళిత నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర మందిర్ సెంటర్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంపల చినరాజు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆరుగుల రమేశ్, ఎస్.గోవిందరావు, టి.మహేశ్, అచ్చిరాజు, సత్తిబాబు, నూకరాజు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

## విశాఖలో ఓపెన్‌గా భూ దందా

... 5వ పేజీ తరువాయి

భవనాల నిర్మాణానికి అవకాశం కలుగుతుంది.

### వైసీపీ నేతతో వ్యవహారం

ఈ విషయాన్ని గుర్తించిన ఓ టీడీపీ నేత .రైతుల భూములపై కన్నేశారు. కానీ అప్పటికి వైసీపీ అధికారంలో ఉంది. దాంతో వైసీపీకి చెందిన నేత ద్వారా వ్యవహారం నడిపించారు. లేఅవుట్ ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాల స్థలాన్ని ఈడబ్ల్యూఎస్ లేవుట్‌లోని పది అడుగుల రోడ్డు విస్తరణకు కేటాయిస్తే, వెనుక భూములకు రోడ్డు సదుపాయం కలుగుతుందని, ప్రతిగా 180 గజాల భూమిని మిగిలిన ఓపెన్‌స్పేస్‌కు కలిసేలా ఇస్తామంటూ మళ్ల రమణ అనే వ్యక్తితో 2023 జూన్ 19న జీవీఎంసీకి దరఖాస్తు చేయించారు. దీనిపై తనకు సన్నిహితుడైన వైసీపీ నేత ద్వారా జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి చేసి, ప్రతిపాదనను కౌన్సిల్‌లో చర్చకు పెట్టకుండా అడ్డదారిలో ముందస్తు ఆమోదం పొంది, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. అయితే ఎన్నికల హడావిడి మొదలవ్వడంతో ఆ ప్రతిపాదన ఆగిపోయింది.

తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనను ఆమోదింపజేసే బాధ్యతను కూటమి నేత తీసుకున్నారు. పలుమార్లు సంబంధిత శాఖల అధికారులపై ఒత్తిడి చేయడంతో ఈ ఏడాది మార్చి ఐదున ఓపెన్ స్పేస్‌లోని 180 గజాల స్థలాన్ని లేఅవుట్ వెనుక ఉన్న రైతుల భూముల్లో లేఅవుట్ వేసుకోవడానికి వీలుగా కేటాయించడంతోపాటు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసేలా ఆదేశిస్తూ జీవీఎంసీకి మెమో జారీచేసింది. ఇందులో లొసుగులున్నాయనే భావనతో నాడు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ ఎంన్‌హరేంధిరప్రసాద్ జాప్యం చేయడంతో భూ బదలాయింపు ప్రక్రియ పూర్తికాలేదు. మధురవాడ జోన్-2 ఆరో వార్డు పరిధి బటర్‌ఫ్లై పార్కులోని 489 గజాల స్థలాన్ని వెనుకవున్న ప్రైవేటు వ్యక్తుల భూమికి బదలాయించిన విషయం 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోటనరవలోని ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌లోని ఓపెన్‌స్పేస్‌ను కూడా అదే మాదిరిగా ప్రైవేటు వ్యక్తుల భూమికి బదలాయించారంటూ పలువురు 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఇచ్చారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారుల వద్ద ఆరా తీయగా ఏపీఎంఆర్‌యూడీఏ చట్టం-2016లోని సెక్షన్ 93 ప్రకారం జీవీఎంసీ భూమిని ప్రైవేటు భూమికి బదులుగా మార్పిడి చేసుకునే వెసులుబాటు ఉందని, దాని ప్రకారమే తాము ముందుకువెళ్లామని వివరణ ఇవ్వడం విశేషం.

## వాణిజ్య పన్నులశాఖలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్న ఉడతా శ్రీనివాసులును నిడదవోలు సర్కిల్‌కు బదిలీ చేశారు. ద్వారకానగర్ సర్కిల్‌లో పనిచేసే కేవీ లక్ష్మీ ప్రసన్నకు కాకినాడ డివిజన్ పరిధి జగన్నాయక్‌పూర్, విశాఖపట్నం సూర్యాబాగ్‌లో పనిచేసే దుల్లా సాంబశివరావును పాలకొల్లు సర్కిల్‌కు బదిలీ చేశారు. వీరితోపాటు మరో 32 మంది డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు బదిలీ లు జరిగాయి. వీరంతా ఉమ్మడి జిల్లా పరిధి నుంచి పలు చోట్లకు వెళ్లారు.

### 'సుపరిపాలనలో తొలి అడుగు'ను విజయవంతం చేయాలి

పాయకరావుపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): త్వరలో పాయకరావుపేటలో నిర్వహించనున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. ఆదివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు అధ్యక్షతన పట్టణ బూత్ కన్వీనర్లు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో త్వరలో పాయకరావుపేటలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పట్టణంలోని 20 వార్డుల్లోని చేపట్టి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు సీహెచ్ ప్రదీప్, పి.శ్రీను, సీహెచ్ రాంబాబు, ఎం.వెంకటరమణ, పల్లా విలియంకేరి, సుబ్రహ్మణ్యం, రమాకుమారి, జె.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# పురాతన భవనం.. విధులకు భయం

## శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయ భవనం

**తహసీల్దార్ కార్యాలయ భవనం కూలిపోయే దశకు చేరింది. ఇది నేడో, రేపో అన్నట్టు తయారైంది. చినుకు పడితే లోపల చిత్తడవుతోంది. రికార్డులకు కనీస భద్రత కొరవడుతోంది. వీటన్నింటికీ మించి పరిస్థితి ఎప్పుడు ఎలా ఉంటుందోనని ఉద్యోగుల్లో భయాందోళన నెలకొంది. ఫలితంగా వారు మనసు పెట్టి పనిచేయలేని దుస్థితి దాపురించింది.**

- దశాబ్దాలుగా అభివృద్ధికి దూరం
- చినుకు పడితే కార్యాలయం చిత్తడి
- కనీస సదుపాయాలు కరువు
- బిక్కుబిక్కుమంటూ పనిచేస్తున్న ఉద్యోగులు



కూలిపోయే దశలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిలిచిపోయిన వర్షం నీరు

**అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి):** జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఇప్పటి తహసీల్దార్ కార్యాలయాన్ని దశాబ్దాల క్రితం బ్రిటిష్ కాలంలో గుర్రాల శాలగా ఉపయోగించేవారని పూర్వీకులు చెబుతున్నారు. బ్రిటిష్ పాలన అంతం కావడంతో తరువాత వచ్చిన ప్రభుత్వం దీన్ని రెవెన్యూ కార్యాలయంగా వినియోగిస్తోంది. అప్పటి నుంచి ఈ కార్యాలయం అభివృద్ధికి ఏ ఒక్కరూ కనీస చర్యలు చేపట్టలేదు. వర్షం పడితే కార్యాలయంలోనే కాకుండా ఆవరణ కూడా చిన్నపాటి చెరువును తలపిస్తున్నది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి సుమారు కోటి రూపాయలు మంజూరు చేశారు. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిధులను వెనక్కి మళ్లించింది. దీంతో నూతన భవన నిర్మాణానికి కదలిక లేకపోయింది. వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోగా, కనీసం మరమ్మతులకు కూడా చర్యలు తీసుకోకపోవడం పట్ల విమర్శలు తావిచ్చింది. కార్యాలయ లోపల భాగం కూడా శిథిలావస్థకు చేరింది. దీంతో కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది



శిథిలావస్థలో ఉన్న కార్యాలయ లోపల భాగం

అసౌకర్యాల మధ్య బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఒకపక్క ఫైళ్లు భద్రపరిచేందుకు బీరువాలు, మరోపక్క టేబుళ్లు, కుర్చీలతో స్థలం నిండిపోవడంతో వివిధ పనులపై వచ్చే ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మాదిరిగానే, కూటమి ప్రభుత్వం కూడా కార్యాలయంపై దృష్టిసారించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తే బాగుంటుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలా ఉండగా తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్, ట్రెజరీ, ఎంపీడీవో, డీఆర్‌డీఏ కార్యాలయాలు కూడా ఉన్నాయి. ఈ కార్యాలయానికి విధులు నిర్వహించడానికి వచ్చే అధికారులు, సిబ్బంది వాహనాలు పెట్టుకునేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి ఏర్పడింది. మొత్తం కార్యాలయాలన్ని తొలగించి ఒక కాంప్లెక్స్ మాదిరిగా అన్ని శాఖలకు అనువుగా ఉండేలా నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రెండు రోజుల క్రితం ప్రకటించారు. ఇది ఆచరణలోకి వస్తే అధికారులు, ఉద్యోగుల ఇబ్బందులు తొలగిపోవడానికి అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రజా ప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



శిథిల భవనంలోనే అసౌకర్యంగా విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

## శ్రీవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): దేముని గుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు పులకండం విజయబాబు, పులకండం గిరిబాబు ఆధ్వర్యంలో మొదటి రోజు సంకల్పం దీక్షధారణ, పంచగవ్యప్రాసన, మత్స్యంగ్రహణం పూజలతో వేడుకలను ప్రారంభించారు. తొలి ఏకాదశి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బి.మురళీకృష్ణ, మాజీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, మాజీ సభ్యులు గోలి మురళీ, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, సిహెచ్.నూకరాజు, అర్చకులు పులకండం ప్రసాద్‌బాబు, పులకండం రాజేశ్ పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి

తుమ్మపాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎంఆర్‌పీఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి పి.వెంకట్రావు అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు కట్టమూరి మంగరాజు, కాకినాడ కనకేశ్వరరావు, బంగారు వెంకటేశ్వరరావు, మారేడుపూడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

## కుక్కలకు వ్యాక్సిన్ తప్పనిసరి

సబ్బవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్థక శాఖ ఏడీ డాక్టర్ కె.ఉషాకుమారి సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం కుక్కలకు వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుక్కల నుంచి ర్యాబిస్ వ్యాధి సంక్రమిస్తే ప్రమాదమన్నారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుల్లేపల్లి వైద్యురాలు డాక్టర్ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రావణమాస ఉత్సవాల కోసం చర్యలు

తుమ్మపాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామని కల్యాణగిరి కనకదుర్గమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కేవీఆర్.కిశోర్ చెప్పారు. ఆలయంలో ఆదివారం జరిగిన కమిటీ సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు వై.త్రినాథరావు, ఎం.సత్తిబాబు, బి.రమణాజీ, పి.సత్యనారాయణ, అన్నదాన కమిటీ ప్రతినిధులు డి.శ్రీనివాసరావు, సింహాద్రినాయుడు, పి.రమణ, .రామచంద్రరావు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని ఫార్మా ఉద్యోగి మృతి



సురేశ్ (ఫైల్ ఫొటో)

లంకెలపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ప్రమాదంలో ఫార్మా ఉద్యోగి మృతి చెందాడు. లంకెలపాలెం రైల్వే ట్రాకు వద్ద శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా హిరమండలం మండలంలోని తులగాం గ్రామానికి చెందిన వజ్జారపు సురేశ్ (28) ఫార్మాసిటీలోని మెట్రోకెమ్ ఫార్మా పరిశ్రమలో పనిచేస్తూ లంకెలపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా విశాఖ నుంచి విజయవాడ వెళ్లే రైలు ఢీకొంది. దీంతో సురేశ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఆదివారం ఉదయం దువ్వాడ జీఆర్పీ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి వైద్యాలయానికి తరలించారు. జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బొగ్గు లారీ బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

పరవాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గంగవరం పోర్టు నుంచి హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గు లోడుతో బయలుదేరిన లారీ రావాడ పంచాయతీ సోమునాయుడుపాలెం సమీపంలో ఆదివారం బోల్తా పడింది. ఈ సమయంలో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడు. అదృష్టవశాత్తూ ఆయన స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గాండ్ల తెలికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గాండ్ల తెలికుల కులానికి రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వాసు కోరారు. పట్టణంలో ఆదివారం జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోపాలయ్య మెమోరియల్ గోల్డ్ మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు రాజుపూడి కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు గండేపల్లి వెంకటరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## శ్యామాప్రసాద్ ముఖర్జీకి బీజేపీ నాయకుల నివాళులు

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ఆధ్వర్యంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి ఆదివారం జరిగింది. ముఖర్జీ చిత్రపటానికి పార్టీ అధ్యక్షుడు పరమేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామాప్రసాద్ ముఖర్జీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రతినిధి కర్రి రామకృష్ణ, బీజేపీ నాయకులు వుడా రమేశ్, పొలమరశెట్టి నాగేశ్వరరావు, బొడ్డేడ నాగేశ్వరరావు, బొడ్డేడ భాస్కరరావు, కొమ్మనాపల్లి సన్యాసిరావు, మారిశెట్టి భాస్కరరావు తదితరులు ముఖర్జీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

## ఖాళీ మద్యం సీసాల కలకలం

**బండారుపాలెం నుంచి గంగునాయుడుపాలెం వెళ్లే రహదారికి ఇరువైపులా పడేసిన వైనం**

**స్థానికుల సమాచారంతో ఎక్సైజ్ పోలీసుల స్వాధీనం**

**కల్తీ మద్యం తయారీ నిందితుల పనేనని అనుమానం**



బండారుపాలెం రహదారికిరువైపులా పడేసిన లేబుల్ లేని మద్యం సీసాలు

పరవాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెం పంచాయతీ పరిధి బండారుపాలెం నుంచి గంగునాయుడుపాలెం గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఆదివారం ఖాళీ మద్యం సీసాలు (క్వార్టర్ బాటిళ్లు) పడి ఉండడం కలకలం రేగింది. పరవాడ కొత్త కాలనీలో కల్తీ మద్యం తయారీ గుట్టును ఇటీవల ఎక్సైజ్ పోలీసులు రట్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇక్కడ ఖాళీ మద్యం క్వార్టర్ సీసాలు రహదారికి ఇరువైపులా కనిపించడంతో ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడక ముందే నిందితులు వీటిని ఇక్కడ పడేసి ఉండవచ్చునని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండుచోట్ల సుమారు 800 ఖాళీ మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉన్నాయి. వాటిపై ఎటువంటి లేబుళ్లు లేవు. దీనిని బట్టి చూస్తే భారీ ఎత్తున పరవాడ కేంద్రంగా కల్తీ మద్యం తయారైనట్టు తెలుస్తోంది. దీనిపై స్థానికులు సబ్బవరం ఎక్సైజ్ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకొని ఖాళీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా కల్తీ మద్యం తయారీ వెనుక పరవాడ ప్రాంతానికి చెందిన వ్యక్తుల ప్రమేయం ఉండవచ్చునని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఖాళీ సీసాలను ఇక్కడ పడేశారని అంటున్నారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ పోలీసులు మరింత లోతుగా విచారణ చేపడితే పలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

- 40 యూనిట్ల రక్తం సేకరణ




రక్తదాన శిబిరంలో పాల్గొన్న యువకులు, గ్రామస్థులు

సబ్బవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగలి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి సుమారు 100 మంది హాజరుకాగా, 40 మంది నుంచి రక్తం సేకరించారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు చేశారు. వంగలితో పాటు రాయపుఅగ్రహారం, టెక్కలిపాలెం, బంగారమ్మపాలెం, ఎసిరసపల్లి తదితర గ్రామాల ప్రజలు ఈ శిబిరానికి హాజరయ్యారు. 30 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ ఆకుల శ్రీహేమ, ఎంపీటీసీ సభ్యురాలు గవర తులసీ, క్యాంప్ మేనేజర్ వెంకటలక్ష్మీ సొబింది, నాయకులు ఎ.గణేశ్, జి.రాజు, పి.అప్పారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

## టీడీపీలోకి వైసీపీ కార్యకర్తలు

పరవాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెన్నెలపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి బండారు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని కొత్తూరు జంక్షన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్టు ట్రాఫిక్ ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. కశింకోట మండలం కన్నూరుపాలెంకు చెందిన ఆర్‌పీ నాయుడు తన భార్య పద్మ, కుమారుడు నీరజ్‌తో పట్టణంలోని షాపింగ్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న ద్విచక్ర వాహన చోదకుడు ఢీకొన్నాడన్నారు. ఈ సంఘటనలో భార్యభర్తలకు స్వల్ప గాయాలు, కాగా చిన్నారి నీరజ్‌కు తల నుదుట భాగంలో తీవ్ర గాయమైందన్నారు. నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

## అంగరంగ వైభవంగా జగన్నాథ తిరుగు రథయాత్ర

- కల్కి అవతారంలో జగన్నాథస్వామి
- దారి పొడవునా స్వామివారిని దర్శించుకున్న భక్తులు



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న రాంకీ... (ఇన్‌సెట్‌లో) కల్కి అవతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజుమ్నహాల్‌లో స్వామివారి నవరాత్రి వేడుకలు పూర్తయ్యాయి. ఆదివారం స్వామివారు కల్కి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి పూజలు చేసిన అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై అర్చకులు వేద మంత్రాల మధ్య ఉత్సవమూర్తులను ఏర్పాటు చేశారు. అనంతరం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) స్వామివారిని దర్శించుకుని రథోత్సవాన్ని ప్రారంభించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కూటమి నాయకులు స్వామివారిని దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. యువత అధిక సంఖ్యలో హాజరై జగన్నాథస్వామిని స్మరించుకుంటూ ఉత్సాహంగా రథాన్ని లాగారు. గూడ్స్‌షెడ్డు వద్ద నుంచి ప్రారంభమైన రథయాత్ర మళ్లవీధి, స్టేషన్ రోడ్డు మీదుగా చిననాలుగు రోడ్ల జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా శారదానది తిరిగి మెయిన్ రోడ్డు మీదుగా చిన నాలుగురోడ్ల జంక్షన్‌కు చేరుకుంది. అక్కడ నుంచి వన్ వే జంక్షన్ అక్కడ నుంచి చిననాలుగురోడ్ల జంక్షన్ రథోత్సవం సాగింది. ఇక్కడ నుంచి రాత్రి చింతావారివీధి, వేగివీధి, నీలకంఠరావువీధి, అగ్గిమర్రిచెట్టు, దిబ్బవీధి, గంగిరేవిచెట్టు, సతకంపట్టు, చినరామస్వామికోవెల, పెదరామస్వామికోవెల, గంగిరేవిచెట్టు మీదుగా అగ్గిమర్రిచెట్టు వద్ద గల జగన్నాథస్వామి ఆలయానికి అర్ధరాత్రి దాటిన తరువాత రథయాత్ర చేరుకుంది. అనంతరం ఉత్సవమూర్తులకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆలయంలో యథావిధిగా అలంకరించారు. ఆలయ ఈవో బి.మురళీ, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, సభ్యులు ఉత్సవంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు. డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ బందోబస్తు నిర్వహించారు. అలాగే పట్టణంలోని పలు ఇళ్లల్లో జగన్నాథస్వామి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే కుటుంబ సభ్యులు, బంధువులను పిలిచి అందరూ సహపంక్తి భోజనాలు చేశారు.

## వార్డుల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆదివారం పలు వార్డుల్లో నిర్వహించారు. 80వ వార్డు పరిధిలోని ముత్రాసికాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. హామీలను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పార్టీ వార్డు అధ్యక్షుడు బీఎస్ఎంకే జోగినాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకుల డి.ప్రసాద్, బి.నూకరాజు, కర్రి మల్లేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే 84వ వార్డు పరిధిలోని పిళ్లావారివీధిలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పిళ్లా తారకేసు, కాంద్రేగుల జగదీశ్, కర్రి కృష్ణ, ఆడారి రవి, లగుడు రాజేశ్ పాల్గొన్నారు.

## నూకాంబికను దర్శించుకున్న భక్తులు

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూకాంబిక అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు బాలాలయంలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. కుటుంబాల సమేతంగా భక్తులుఅమ్మవారి దర్శనానికి వచ్చారు. ఆలయ ఆవరణతో పాటు చుట్టుపక్కల తోటల్లో వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో కె.ఎల్.సుధారాణి చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ బందోబస్తు చేపట్టారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

- తగరంపూడిలో భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

తుమ్మపాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నియోజకవర్గంలోని వేర్వేరు చోట్ల ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి మండలం తగరంపూడి జగనన్న కాలనీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి భర్త మరణించారు. అతని భార్య తీవ్రంగా గాయపడ్డారు. రావికమతం మండలం మట్టవానిపాలెం గ్రామానికి చెందిన బలిరెడ్డి ప్రసాద్ (46), తన భార్య ఉషాతో కలిసి అత్తగారి గ్రామమైన తుమ్మపాలకు ఆదివారం వ్యవసాయ పనుల మీద వచ్చారు. పనులు ముగించుకొని రాత్రి స్వగ్రామమైన మట్టవానిపాలెంకు తిరిగి వెళ్తుండగా, తగరంపూడి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బలిరెడ్డి ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. అతని భార్య బలిరెడ్డి ఉషాతీవ్ర గాయాలతో రోడ్డు పై పడిపోయింది. దీంతో హుటాహుటిన స్థానికులు వారిని ఎన్టీఆర్ వైద్యాలయానికి చికిత్స నిమిత్తం తరలించారు. బలిరెడ్డి ప్రసాద్‌కు ఇద్దరు కుమారులు ఉండగా వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని నడిపిస్తున్నాడు. ఒక్కసారిగా కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతి చెందడంతో ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అయితే ప్రమాదానికి కారణమైన వాహనం సంఘటన స్థలం వద్ద లేకపోవడంతో సమీపంలో ఉండే సీసీ కెమెరాల ఆధారంగా ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ నాగేశ్వరరావు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు.

## నరసన్నపేటలో కంటైనర్ ఢీకొని మరొకరు..

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని కశింకోట మండలం బయ్యవరం వద్ద ఆదివారం గుర్తు తెలియని బొలెరో కంటైనర్ ఢీకొన్న సంఘటనలో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం పెద్దబోరిగావలస గ్రామానికి చెందిన రాజాపు గురన్న (64) మృతి చెందినట్టు కశింకోట సీఐ ఎ.స్వామినాయుడు తెలిపారు. బయ్యవరం హోటల్ ఎదురుగా గురన్న రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొనడంతో గురన్న మృతి చెందినట్టు సీఐ చెప్పారు. గ్రామస్థుడు ఎం.శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఆయన చెప్పారు. కాగా, వ్యక్తిని ఢీకొని పరారైన బొలెరో కంటైనర్ కోసం తనతోపాటు ఎస్ఐ లక్ష్మణరావు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చ్యురీకి తరలించామన్నారు.



నీటి బిందెలతో ఉమారామలింగేశ్వరాలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

## నేత్ర పర్వం.. సహస్ర ఘటాభిషేకం

సబ్బవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గొర్లివానిపాలెం గ్రామంలో ఆషాఢ శుద్ధ ఏకాదశి పురస్కరించుకొని నిర్వహించిన సహస్ర ఘటాభిషేకం నేత్ర పర్వంగా జరిగింది. ముందుగా పరమ శివుడికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు మాట్లాడుతూ.. 48 ఏళ్లుగా ఇక్కడ సహస్ర ఘటాభిషేకం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురిసి రాష్ట్రంలో, దేశంలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలి ప్రార్థిస్తూ కార్యక్రమం చేపడతామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు, మాజీ ఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావు, గ్రామ నాయకులు ఆర్.సత్యం, టి.శివ, లెక్కల శ్రీమూర్తులు, జి.నీలేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వెంకన్న గిరి ప్రదక్షిణ

**దారి పొడువునా భజనలు, భక్తి గీతాలాపన.. భారీగా తరలివచ్చిన భక్తులు**



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న అశేష భక్తజనం ... (ఇన్‌సెట్‌లో) పూజలు అందుకున్న వెంకటేశ్వరస్వామి

పరవాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో వెంకన్న గిరి మార్మోగింది. భక్తులతో కొండ నిండిపోయింది. తొలి ఏకాదశి సందర్భంగా ఈ.బోనంగి ఫార్మా పునరావాస కాలనీ కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయ నుంచి తొలిసారి గిరి ప్రదక్షిణ ఆదివారం నిర్వహించారు. గౌతులచ్చన్ననగర్, పెట్రోల్ బంక్, మండల పరిషత్ జంక్షన్‌ల మీదుగా ఈ.బోనంగి ఆంజనేయస్వామి ఆలయం, బీకే స్టీల్ పరిశ్రమ, ఫార్మాసిటీ కాలనీ మీదుగా స్వామివారి పాదాలకు చేరుకుంది. సుమారు ఆరు కిలోమీటర్ల మేర గిరి ప్రదక్షిణ కొనసాగింది. మండలం నలుమూలల నుంచి భక్తులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా భజనలు, భక్తి గీతాలాపనలు చేస్తూ స్వామివారి ఆలయానికి భక్తులు చేరుకున్నారు. అనంతరం స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు పాల్గొన్నారు.

## మధ్యంతర భృతి ప్రకటించాలి: యూటీఎఫ్

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు డీఏ, పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్‌లు, రిటైర్ ఉద్యోగులకు బకాయిలను చెల్లించాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు వత్సవాయి శ్రీలక్ష్మి, పి.వెంకటరావు, రొంగలి అక్కునాయుడు, జోగా రాజేశ్ పాల్గొన్నారు.

## రాత్రి పది గంటల తర్వాత బయట తిరిగితే చర్యలు : ఎస్ఐ



సీలేరులో శనివారం అర్ధరాత్రి రోడ్డుపై సంచరిస్తున్న యువతను తనిఖీ చేస్తున్న స్థానిక పోలీసులు

సీలేరు, జూలై 6 , (ఆంధ్రజ్యోతి) : రాత్రి పది గంటలు దాటిన తరువాత ఎవరైనా రోడ్లు, వీధుల్లో సంచరిస్తే చర్యలు తీసుకుంటామని సీలేరు ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు. జీకేవీధి మండలం సీలేరులో ఇటీవల చిన్న దొంగతనాలు, ద్విచక్ర వాహనాలు అపహరణ, బైకుల నుంచి పెట్రోలు అపహరణ తదితర సంఘటనల నేపథ్యంలో సీలేరులో శనివారం రాత్రి గస్తీని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ, సీలేరులో చోరీపై నిఘా పెట్టామని, ఈ నేపథ్యంలో రాత్రి 10 గంటల తరువాత ఎవరూ బయట సంచరించవద్దన్నారు. అలాగే, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 2వ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ



సీలేరులో శనివారం అర్ధరాత్రి రోడ్డుపై సంచరిస్తున్న యువతను తనిఖీ చేస్తున్న స్థానిక పోలీసులు

పాడేరురూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు క్షేత్రస్థాయిలో వైద్య సేవలందిస్తున్న 2వ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.చిన్నయ్యపడాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో 2వ ఏఎన్ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లగా రెగ్యులర్ ఏఎన్ఎంలతో సమానంగా విధులు నిర్వహిస్తున్న 2వ ఏఎన్ఎంల పట్ల వివక్షత చూపడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీరిని కాంట్రాక్టు ఏఎన్ఎంలుగా మార్పు చేయాలని, రెగ్యులర్ ఏఎన్ఎంలకు ఇచ్చినట్లు అలవెన్స్‌లు అందించాలని, సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం 2వ ఏఎన్ఎంల తాత్కాలిక జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్.సుందరరావు, శెట్టి నాగరాజు పాల్గొన్నారు.

## వైసీపీకి మండల సోషల్ మీడియా కన్వీనర్ రాజీనామా



వైసీపీకి రాజీనామా చేసిన మధు

చింతపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల సోషల్ మీడియా కన్వీనర్ పెదపూడి మధు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వైసీపీలో గత 15ఏళ్లగా పనిచేస్తున్నానన్నారు. కార్యకర్తగా, మండల నాయకుడిగా, ఐదేళ్లగా మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నానన్నారు. కష్టపడి పనిచేసిన నాయకులకు పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వడంలేదని, ఈ నేపథ్యంలో పార్టీకి దూరం కావాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. తన రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకి పంపించినట్టు చెప్పారు.

## రాయితీపై రాగి నూతన వంగడాలు



రాగి వంగడాల మినీ కిట్లు చూపిస్తున్న ఏవో

చింతపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు శతశాతం రాయితీపై రాగిలో నూతన వంగడాలు పంపిణీ చేస్తామని స్థానిక వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అధిక దిగుబడులు, పోషక విలువలు కలిగి, శాస్త్రవేత్తలు సిఫారసు చేసిన ఇంద్రావతి, వేగావతి వంగడాల మినీ కిట్లను అభ్యుదయ రైతులకు పంపిణీ చేస్తామన్నారు. మండలంలో 223మంది రైతులను ఎంపిక చేశామన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

గూడెంకొత్తవీధి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో అర్హులందరికి ప్రభుత్వం పథకాలు చేరువవుతున్నట్టు టీడీపీ మాజీ మండల కార్యదర్శి మామిడి నాగేంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని సంకాడ పంచాయతీ డింగిరాయి, చిత్తమామిడి, కుమ్మరాపల్లి, చినజడుమురు గ్రామాల్లో సుపరిపాన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చుతున్నారన్నారు. తల్లికి వందనం పథకం ఇంటిలో ఎంతమంది చిన్నారులంటే అందరికీ అందిస్తున్నారన్నారు. ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సడ్డ బుజ్జిపడాల్, ఊలం బాబూరావు, దేశగిరి సంజీవ్‌రావు, గంగరాజు, రాధమ్మ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





పెదబయలులో శునకాలకు వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ రాజారవికుమార్, సిబ్బంది, అనంతగిరిలో వైద్యాధికారి గణేశ్వరరావు

# జంతువుల నుంచి సంక్రమిత వ్యాధులపై అప్రమత్తం

» పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజా రవికుమార్

పెదబయలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాగ్రత్తలు పాటిస్తే పెంపుడు జంతువులతో మనుషులకు సంక్రమించే వ్యాధులను నివారించవచ్చని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రాజా రవికుమార్ తెలిపారు. ఆదివారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా సీతగుంట వద్ద గల పశు సంవర్ధక శాఖ కార్యలయంలో 36 పెంపుడు కుక్కలకు యాటీ రేబిస్ టీకాలను వేశారు. జంతుప్రేమికులు, పెంపకందారులు ఎప్పటికప్పుడు జంతువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు. సోమవారం నుంచి మండలంలోని సచివాలయాల పరిధిలో రేబిస్ టీకాలు పెంపుడు శునకాలకు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. చరణ్, ఎంపీటీసీ సభ్యుడు కె. బొంజుబబాబు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### అనంతగిరిలో 68 పెంపుడు కుక్కలకు టీకాలు

అనంతగిరి: మండలంలోని కాశీపట్నం పశువైద్యశాలలోఆదివారం 68 పెంపుడు కుక్కలకు ర్యాబీస్ వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు తెలిపారు. ర్యాబీస్ అనేది ప్రాణాంతకమైన వ్యాధి అని దీనిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జూనియర్ వెటర్నరీ అధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: లంబసింగి పశు వైద్య శాలలో పశువైద్యాధికారి చల్లంగి చాలిని పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబీస్ టీకాలు వేశారు. ఈసందర్భంగా పెంపుడు జంతువుల నుంచి మానవులకు వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలకు సైతం టీకాలు వేయించాలన్నారు.

## పని గంటల పెంపుతో కార్మికుల శ్రమ దోపిడీ: సీఐటీయూ



బైక్ యాత్ర ప్రారంభించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

పాడేరురూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పనిగంటలను పెంచి కార్మికుల, ఉద్యోగుల శ్రమను దోపిడీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంకణం కట్టుకున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. ఈ నెల 9వ తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన బైక్ యాత్రను ఆదివారం ఆయన పాడేరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పనిని 10 గంటలకు పెంచుతూ రాష్ట్ర మంత్రి వర్గం తీర్మానం చేయడంపై ఆయన మండిపడ్డారు. అదనంగా రోజుకు 2 గంటల పని సమయాన్ని పెంచడమంటే కార్మికులు, ఉద్యోగుల శ్రమను దోచుకోవడమేనని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రం గుజరాత్‌లో 12 గంటలు పనిని అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు శెట్టి నాగరాజు, లక్ష్మణ్, జయరాజ్, అర్జున్, గౌరినాయుడు, దేముడు, నగేశ్, చిట్టిబాబు, కొండబాబు, బొజ్జన్న, ఎల్ సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌వీనగర్-సీలేరు రహదారి బురదమయం

అవస్థలు పడుతున్న వాహనచోదకులు



లంకపాకలు వద్ద బురదమయమైపోయిన రహదారి

గూడెంకొత్తవీధి, జూలై 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఆర్‌వీనగర్-సీలేరు అంతర్ రాష్ట్ర ప్రధాన రహదారి బురదమయం అయ్యింది. దీంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఆర్‌వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు రహదారి అధ్వానంగా తయారైంది. రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో పోలీసులు గోతుల్లో మట్టితో పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రహదారి బురదగా మారిపోయింది. దీంతో ఈ మార్గంపై ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైన ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం బురదమయమైన రహదారిపై వెట్‌మిక్స్ వేస్తే అవస్థలు తప్పుతాయని ప్రాంతీయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పింఛన్ మంజూరు చేయరూ..



పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధురాలు

సీలేరు, జూలై 6 , (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధి రాళ్ళగెడ్డ గ్రామానికి చెందిన సిర్గం గురి తనకు పింఛన్ మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నారు. తనకు భర్త గానీ, పిల్లలు గానీ ఎవరూ లేని ఒంటరి మహిళని అని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వచ్చిన పింఛన్‌ను నిలిపేసారని వాపోయింది.. ఎన్ని సార్లు సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ వద్దకు వెళ్లినా తనకు పింఛన్ పునరుద్ధరించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. జీవనోపాధి కష్టంగా ఉందని, కూటమి నాయకులు, అధికారులు స్పందించి తనకు పింఛన్ పునరుద్ధరించాలని అభ్యర్థించారు.

## పీహెచ్‌సీల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి: డీఎంహెచ్‌వో



ఈదులపాలెం పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరరావు నాయుడు

పాడేరురూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగే విధంగా వైద్యులు, సి బ్బంది చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో టి.విశ్వేశ్వరరావునాయుడు ఆదేశించారు. మండలంలోని మారుమూల ఈదుల పాలెం పీహెచ్‌సీని అకస్మికంగా ఆయన సందర్శించారు. గత నెలలో జ్వర లక్షణాతో వచ్చిన రోగులకు మలేరియా నిర్ధారణ పరీక్షలు జరపగా, వారిలో 20 మందికి మలేరియా ఉన్నట్లు నిర్ధారణయినట్టు ఈ సందర్భంగా వైద్యాధికారి ఆయనకు వివరించారు. వారికి అందించిన వైద్యసేవలు, ఆయా బాధితుల గ్రామాల్లో జరిపిన ఏసీఎం 5 శాతం స్ప్రేపై సిబ్బందిని డీఎంహెచ్‌వో అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ పరిధిలో మాతా శిశు మరణాల నివారణలో జాగ్రత్తలను వివరించారు. ఎపిడిమిక్ సీజన్ నేపథ్యంలో అత్యవసర మందులు, వ్యాక్సిన్‌లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోవాలని వైద్యాధికారికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహారావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### శిశు మరణాలపై అప్రమత్తం

డుంబ్రిగుడ : మండలంలో శిశు మరణాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో తమర్బ విశ్వేశ్వరనాయుడు ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆసుపత్రిలోని పలు రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ పరిసరాలు పరిశీలించిన ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## గోదుమలంక పాఠశాల పునః ప్రారంభం

» ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



విద్యార్థులకు స్కూల్ కిట్లు అందజేస్తున్న ఉపాధ్యాయుడు దేవరాజ్

కొయ్యూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బూదరాళ్ళ పంచాయతీ గోదుమ లంక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభమైంది. ఉపాధ్యాయుడు లేక మూతపడిన ఈ పాఠశాలకు వంతమర్రి పాఠశాల నుంచి బదిలీపై సెగ్గే దేవ రాజ్ ఉపాధ్యాయుడు రావటంతో ఎట్టకేలకు వచ్చారు. అయితే వంతమర్రి పాఠశాలలో పని చేస్తున్న దేవరాజ్ గోదుమలంక రావటంతో అక్కడ శాశ్వత ఉపాధ్యాయుడు లేక భాషా వలంటీరుతో పాఠశాల నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. గోదుమలంక పాఠశాలలో 22 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు, బ్యాగ్, తదితర సామగ్రిని ఉపాధ్యాయుడు విద్యార్థులకు పంపిణీ చేయటంతో ఈ విద్యాసంవత్సరం చదువుకు మార్గం సుగమమైంది. వంతమర్రి విషయమై స్కూల్ కాంపెక్సు హెచ్ఎంను సంప్రదించగా వంతమర్రి పాఠశాలకు త్వరలో డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయుడిని నియమించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## ఘనంగా తొలి ఏకాదశి పూజలు

సీలేరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం ధారాలమ్మ ఘాట్ రోడ్డులో వెలసిన ధారాలమ్మ ఆలయంలో ఆషాఢ మాసం, తొలి ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని గజమాలలతో, నిమ్మకాయల దండలతో అలంకరించారు. తొలి ఏకాదశి కావడంతో అమ్మవారిని రాష్ట్ర నలుమూల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి దర్శించుకున్నారు. సీలేరులో స్థానిక వెంకటేశ్వరస్వామి, అంజనేయస్వామి, శివాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

### రామాలయంలో పూజలు

చింతపల్లి: స్థానిక రామాలయంలో అర్చకుడు జగన్ కుంకుమార్చన, ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆషాడంలో వచ్చిన ఏకాదశి కావడంతో భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేక పూజలకు అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



సీలేరులో గజమాల అలకరణంలో ధారాలమ్మ



చింతపల్లి రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

# హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతుల రద్దుకు ఉద్యమం

» గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర

అనంతగిరి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణాలతో గిరిజనులు తీవ్రంగా నష్టపోతారని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆందోళన వ్యక్తంచేశారు. మండలంలోని టోకూరు పంచాయతీ చిట్టంపాడు వద్ద హైడ్రో పవర్ ప్రాజెక్టులకు ఏర్పాటుపై సర్వే అధికారులు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలలో ఆదివారం ఆ ప్రాంతానికి స్థానిక నాయకులతో కలిసి వెళ్లారు. గిరిజన ప్రాంతానికి ప్రత్యేక హక్కులు, చట్టాలను కార్పొరేట్ శక్తులకు కనుమరుగు చేయాలని చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెదకోట పంచాయతీ కుడియా, గుమ్మకోట, టోకూరు పంచాయతీల పరిధి గుజ్జెలి, చిట్టంపాడులోని హైడ్రోపవర్ ప్రాజెక్టులకు అనుకూలంగా ఇచ్చిన జీవో 51ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే గిరిజనులతో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సర్పంచ్ మోస్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, పెదబిడ్డ ఎంపీటీసీ జయశ్రీ, నాగులు, తదితరులు పాల్గొన్నారు.

### హైడ్రో పవర్ ప్రాజెక్టు జీవో కాపీలు దహనం

ముంచంగిపుట్టు: అనంతగిరిలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతుల జీవో 51ని రద్దుచేయాలని గిరిజనసంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ మాల గుమ్మి గ్రామంలో ఈ ప్రతులు దహనం చేసి నిరసన వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల కార్యదర్శి కె.నర్సయ్య మాట్లాడుతూ స్థానిక ఆదివాసీలను సంప్రదించకుండా, పె సా గ్రామ సభ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా అదానీ కంపెనీకి హైడ్రో ప్రాజెక్టును అప్పగించడం అన్యాయమన్నారు. ఈ జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేతలు కె.శ్రీను, వి.చందు, వి.చంద్రయ్య, ఆర్.దేవన్న తదితరులు పాల్గొన్నారు.



చిట్టంపాడు జలపాతం వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు, తదితరులు

## ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

» పాడేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



కుజ్జెలి గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న గిడ్డి ఈశ్వరి

పాడేరురూరల్, జూలై 6(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఇంటిలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షే వెలుగులు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలుగుదేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె మండలంలోని కుజ్జెలి గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. గడిచిన ఏడాదిలో ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. పథకాల వల్ల కలిగే ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఏడాది కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు రొబ్బి రాము తదితరులు పాల్గొన్నారు.

## కిండలంలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని వినతి



జీసీసీ చైర్మన్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న కె. బొడ్డాపుట్టు యువత

పెదబయలు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కుంతుర్ల పంచాయతీ కిండలం గ్రామంలో మినీ రేషన్ డిపో ఏర్పాటు చేయాలని కే. బొడ్డాపుట్టు గ్రామ యువత రాష్ట్ర జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు.ఆదివారం పాడేరులోని కిడారి క్యాంప్ కార్యాలయంలో ఈ మేరకు వినతి పత్రమిచ్చారు. పంచాయితీ పరిధిలోని శివారు గ్రామాలైన కె. బొడ్డాపుట్టు, కందులగుంట, జాలరిగుమ్మి, కిండలం గ్రామాల్లో 150 పైగా రేషన్ కార్డుదారులున్నారన్నారు. స్థానికంగా రేషన్ డిపో లేక 30 కిలోమీటర్ల దూరాన ఉన్న సంపంగిపుట్టు వెళ్లి రేషన్ సరుకులు తీసుకోవాల్సి వస్తోందని వివరించారు.అందుకు ఒక్కొకరికి రవాణాకు రూ. 200 ఖర్చు అవుతుందని వాపోయారు. శ్రావణ్‌కుమార్ సానుకూలంగా స్పందిస్తూ డిపో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మణుగూరు బాబూజీ, మాధవరావు, సంజీవరావు, జగదీశ్ పాల్గొన్నారు.

## 'మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మించాలి'



మెట్టవలసలో సీసీరోడ్డును పరిశీలిస్తున్న టీడీపీ నేత సోవేరి సుబ్బారావు

అనంతగిరి, జూలై 6(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలకు సీసీరోడ్లు నిర్మించాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సోవేరి సుబ్బారావు కోరారు. మండలంలోని వాలసీ పంచాయతీ మెట్టవలస తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పర్యటించారు. గ్రామంలో సీసీరోడ్డు లేకపోవడం వర్షం నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో వ్యాధులబారినపడుతున్నామని గిరిజనులు వాపోయారు. ఈ స్థితిలో అధికారులు స్పందించి సీసీరోడ్లు వేసేందుకు చర్యలు చేపట్టాలని సుబ్బారావు కోరారు.

## ' ఏకపక్ష మండల కమిటీని రద్దు చేయాలి'



మాట్లాడుతున్న మాజీ టీడీపీ మండలాధ్యక్షుడు బేరా సత్యనారాయణ పడాల్, టీడీపీ నాయకులు

చింతపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పాడేరులో ఏకపక్షంగా ఎన్నుకున్న నూతన చింతపల్లి టీడీపీ మండల కమిటీని రద్దు చేయాలని ఆ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు బేరా సత్యనారాయణ పడాల్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్యనాయకులు సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ గ్రామ కమిటీ, మండల కమిటీలు పారదర్శకంగా నిర్వహించాలని పార్టీ అధిష్టానం పరిశీలకులను నియమించినట్టు చెప్పారు. ఎన్నిక ముందు కార్యకర్తలు, నాయకులకు సమాచారం ఇచ్చి, మండల కేంద్రంలో నిర్వహిస్తే అర్హులను ఎన్నుకునే అవకాశం ఉంటుందన్నారు. పాడేరులో నియోజక వర్గం పరిశీలకులు బుద్దా నాగజగదీశ్ మండల కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగానూతన కమిటీని ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య, నాయకులు బండి రమణ, గెమ్మెలి దేముడు బాబు, గడుతూరి బాలకృష్ణ, బుజ్జిబాబు, ముర్ల సత్యనారాయణ, పాల్గొన్నారు.

**గూడెంకొత్తవీధి:** టీడీపీ మండల కమిటీ ఎన్నికలు స్థానికంగా నిర్వహించాలని ఆ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు కొర్ర బలరామ్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చింతపల్లి టీడీపీ మండల పార్టీ ఎన్నిక పాడేరులో నిర్వహించడం వల్ల స్థానిక కార్యకర్తలు, నాయకులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు నక్క తిరుమలరావు, లక్కీ రామారావు, పంగ్రా నూకరాజు, మొట్టడం సర్భన్నపడాల్, సిరిబాల బుజ్జిబాబు, మామిడి బాలయ్య పడాల్ పాల్గొన్నారు.

## విశాఖలో ఓపెన్‌గా భూ దందా

... 5వ పేజీ తరువాయి

భవనాల నిర్మాణానికి అవకాశం కలుగుతుంది.

### వైసీపీ నేతతో వ్యవహారం

ఈ విషయాన్ని గుర్తించిన ఓ టీడీపీ నేత ..రైతుల భూములపై కన్నేశారు. కానీ అప్పటికి వైసీపీ అధికారంలో ఉంది. దాంతో వైసీపీకి చెందిన నేత ద్వారా వ్యవహారం నడిపించారు. లేఅవుట్ ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాల స్థలాన్ని ఈడబ్ల్యూఎస్ లేవుట్‌లోని పది అడుగుల రోడ్డు విస్తరణకు కేటాయిస్తే, వెనుక భూములకు రోడ్డు సదుపాయం కలుగుతుందని, ప్రతిగా 180 గజాల భూమిని మిగిలిన ఓపెన్‌స్పేస్‌కు కలిసేలా ఇస్తామంటూ మళ్ల రమణ అనే వ్యక్తితో 2023 జూన్ 19న జీవీఎంసీకి దరఖాస్తు చేయించారు. దీనిపై తనకు సన్నిహితుడైన వైసీపీ నేత ద్వారా జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి చేసి, ప్రతిపాదనను కౌన్సిల్‌లో చర్చకు పెట్టకుండా అడ్డదారిలో ముందస్తు ఆమోదం పొంచి, రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. అయితే ఎన్నికల హడావిడి మొదలవ్వడంతో ఆ ప్రతిపాదన ఆగిపోయింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ ప్రతిపాదనను ఆమోదింపజేసే బాధ్యతను కూటమి నేత తీసుకున్నారు. పలుమార్లు సంబంధిత శాఖల అధికారులపై ఒత్తిడి చేయడంతో ఈ ఏడాది మార్చి ఐదున ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాల స్థలాన్ని లేఅవుట్ వెనుక ఉన్న రైతుల భూముల్లో లేఅవుట్ వేసుకోవడానికి వీలుగా కేటాయించడంతోపాటు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసేలా ఆదేశిస్తూ జీవీఎంసీకి మెమో జారీచేసింది. ఇందులో లొసుగులున్నాయనే భావనతో నాడు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించిన జిల్లా కలెక్టర్ ఎంన్‌హరేంధిరప్రసాద్ జాప్యం చేయడంతో భూ బదలాయింపు ప్రక్రియ పూర్తికాలేదు. మధురవాడ జోన్-2 ఆరో వార్డు పరిధి బటర్‌ఫ్లై పార్కులోని 489 గజాల స్థలాన్ని వెనుకవున్న ప్రైవేటు వ్యక్తుల భూమికి బదలాయించిన విషయం 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోటనరవలోని ఈడబ్ల్యూఎస్ లేఅవుట్‌లోని ఓపెన్‌స్పేస్‌ను కూడా అదే మాదిరిగా ప్రైవేటు వ్యక్తుల భూమికి బదలాయించారంటూ పలువురు 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఇచ్చారు. దీనిపై టౌన్‌ప్లానింగ్ అధికారుల వద్ద ఆరా తీయగా ఏపీఎంఆర్‌యూడీఏ చట్టం-2016లోని సెక్షన్ 93 ప్రకారం జీవీఎంసీ భూమిని ప్రైవేటు భూమికి బదులుగా మార్పిడి చేసుకునే వెసులుబాటు ఉందని, దాని ప్రకారమే తాము ముందుకువెళ్లామని వివరణ ఇవ్వడం విశేషం.

## వాణిజ్య పన్నులశాఖలో బదిలీలు

... 5వ పేజీ తరువాయి

పనిచేస్తున్న ఉడతా శ్రీనివాసులును నిడదవోలు సర్కిల్‌కు బదిలీ చేశారు. ద్వారకానగర్ సర్కిల్‌లో పనిచేసే కేవీ లక్ష్మీ ప్రసన్నకు కాకినాడ డివిజన్ పరిధి జగన్నాయక్‌పూర్, విశాఖపట్నంసూర్యాబాగ్‌లో పనిచేసే దుల్లా సాంబశివరావును పాలకొల్లు సర్కిల్‌కు బదిలీ చేశారు. వీరితోపాటు మరో 32 మంది డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లకు బదిలీ లు జరిగాయి. వీరంతా ఉమ్మడి జిల్లా పరిధి నుంచి పలు చోట్లకు వెళ్లారు.

## జగన్నాథుని తిరుగు రథోత్సవం



స్వామి వారి తిరుగు రథోత్సవంలో భక్తులు

మాడుగుల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూకాలమ్మ కాలనీలో ని జగన్నాథస్వామి మారు రథయాత్ర ఘనంగా నిర్వహించారు. ఇంద్రద్యుమ్న మందిరంలో పూజలందుకున్న స్వామి ఆదివారం తిరిగి ప్రధాన ఆలయానికి చేరుకున్నారు. రథోత్సవాల్లో భాగంగా జగన్నాథుడు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఏకాదశి సందర్భంగా ఆయలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అర్చకుడు పండా నూకరాజు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఆలయ చైర్మన్ బొడ్డేటి ఆదినారాయణ (స్వామి) ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సాయంత్రం జగన్నాథుడు ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు.

## ఘనంగా తొలి ఏకాదశి పూజలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

దేవరాపల్లి, జూలై 6 (ఆంధ్ర జ్యోతి) తొలి ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి పాలాభి షేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు చంద్రమౌళి ఆదిత్య, నాగేశ్వరరావు శర్మ ప్రత్యేక పూజలు చేయించారు.

## శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి ఘన నివాళులర్పిస్తున్న బీజేపీ నేత రాజేశ్వరావు తదితరులు

రావికమతం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ జాతీయ వాది డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని మండలంలో గుడ్డిప గ్రామంలో ఆదివారం బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు గల్లా రాజేశ్వరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జనసంఘ్ స్థాపించి గొప్ప మార్గదర్శకులుగా నిలిచారని ఆయన కొనియాడారు. దేశంలో కాశ్మీర్ అంతర్భాగంగా కావడానికి శ్యామ్ ప్రసాద్ బలిదానమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.శ్రీనివాస్, ఎ.ఆదినారాయణ, ఎం. మాతారావు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దేవరాపల్లి, జూలె 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలాపల్లి, కొత్తపెంట గ్రామాలకు సోమవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపు చేస్తున్నట్లు ఏఈఈ కర్రిశంకరరావు ఆదివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

▸▸ తగరంపూడిలో భర్త మృతి.. భార్యకు తీవ్ర గాయాలు

తుమ్మపాల/రావికమతం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి నియోజకవర్గంలోని వేర్వేరు చోట్ల ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి మండలం తగరంపూడి జగనన్న కాలనీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి భర్త మరణించారు. అతని భార్య తీవ్రంగా గాయపడ్డారు. రావికమతం మండలం మట్టువానిపాలెం గ్రామానికి చెందిన బలిరెడ్డి ప్రసాద్ (46), తన భార్య ఉషాతో కలిసి అత్తగారి గ్రామమైన తుమ్మపాలకు ఆదివారం వ్యవసాయ పనుల మీద వచ్చారు. పనులు ముగించుకొని రాత్రి స్వగ్రామమైన మట్టువానిపాలెంకు తిరిగి వెళ్తుండగా, తగరంపూడి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బలిరెడ్డి ప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందారు. అతని భార్య బలిరెడ్డి ఉషాతీవ్ర గాయాలతో రోడ్డు పై పడిపోయింది. దీంతో హుటాహుటిన స్థానికులు వారిని ఎన్టీఆర్ వైద్యాలయానికి చికిత్స నిమిత్తం తరలించారు. బలిరెడ్డి ప్రసాద్‌కు ఇద్దరు కుమారులు ఉండగా వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని నడిపిస్తున్నాడు. ఒక్కసారిగా కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతి చెందడంతో ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అయితే ప్రమాదానికి కారణమైన వాహనం సంఘటన స్థలం వద్ద లేకపోవడంతో సమీపంలో ఉండే సీసీ కెమెరాల ఆధారంగా ఆచూకీ తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు అనకాపల్లి రూరల్ ఎస్ఐ నాగేశ్వరరావు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు.

## నరసన్నపేటలో కంటైనర్ ఢీకొని మరొకరు..

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని కశింకోట మండలం బయ్యవరం వద్ద ఆదివారం గుర్తు తెలియని బొలెరో కంటైనర్ ఢీకొన్న సంఘటనలో శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం పెద్దబోరిగావలస గ్రామానికి చెందిన రాజాపు గురన్న (64) మృతి చెందినట్టు కశింకోట సీఐ ఎ.స్వామినాయుడు తెలిపారు. బయ్యవరం హోటల్ ఎదురుగా గురన్న రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొనడంతో గురన్న మృతి చెందినట్టు సీఐ చెప్పారు. గ్రామస్థుడు ఎం.శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఆయన చెప్పారు. కాగా, వ్యక్తిని ఢీకొని పరారైన బొలెరో కంటైనర్ కోసం తనతోపాటు ఎస్ఐ లక్ష్మణరావు రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చ్యురీకి తరలించామన్నారు.

## రైలు ఢీకొని ఫార్మా ఉద్యోగి దుర్మరణం

లంకెలపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ప్రమాదంలో ఫార్మా ఉద్యోగి మృతి చెందాడు. లంకెలపాలెం రైల్వే ట్రాకు వద్ద శనివారం రాత్రి జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా హిరమం డలం మండలంలోని తులగాం గ్రామానికి చెందిన వజ్రారపు సురేశ్ (28) ఫార్మాసిటీలోని మెట్రోకెమ్ ఫార్మా పరిశ్రమలో పనిచేస్తూ లంకెలపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి 11 గంటల సమయంలో రైలు పట్టాలు దాటుతుండగా విశాఖ నుంచి విజయవాడ వెళ్లే రైలు ఢీకొంది. దీంతో సురేశ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఆదివారం ఉదయం దువ్వాడ జీఆర్పీ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యు లకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి వైద్యాలయానికి తరలించారు. జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కశింకోటలో గుర్తు తెలియని వ్యక్తి...

కశింకోట (అనకాపల్లి టౌన్), జూలై 6 (ఆంధ్రజ్యోతి): తుని జీఆర్పీ పరిధిలోని రేగుపాలెం-నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్ వద్ద రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా సుమారు 50 ఏళ్ల వ్యక్తిని రాజమండ్రి నుంచి విశాఖకు వెళ్లే మార్గంలో గుర్తు తెలియని రైలు ఢీకొట్టడం వల్ల అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లేవని చెప్పారు. తెలుపు రంగు ఫుల్ చేతుల చొక్కా, సిమెంట్‌రంగు మీద నలుపు చుక్కలు ఉన్న షర్టు, నాగలి తువ్వాలు ఉందన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చ్యురీ గదిలో భద్రపరిచామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుని ఆచూకీ తెలిస్తే సెల్ నంబరు 9490619020కు సంప్రదించాలని ఆయన సూచించారు.

# సంకర జాతి పశువులకు థైలీరియా టీకాలు

నర్సీపట్నం డివిజన్‌కి 27500 టీకాలు మంజూరు

రూ.850 ఖరీదు చేసే టీకా ఉచితంగా పంపిణీ

పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ రాంబాబు



థైలీరియా టీకా గురించి వివరిస్తున్న ఏడీ డాక్టర్ రాంబాబు

నర్సీపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలు దాటిన దూడలు, ఆడ, మగ సంకరజాతి పశువులకు థైలీరియా టీకాలు ఉచితంగా వేయడం జరుగుతుందని పశు సంవర్ధశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు తెలిపారు. పట్టణంలో ఈ టీకా గురించి సిబ్బందికి ఆదివారం ఆయన వివరించారు. నర్సీపట్నం డివిజన్‌కు రూ.46.75 లక్షలు విలువ చేసే 27,500 టీకాలు వచ్చాయని తెలిపారు. థైలీరియా వ్యాధి సోకిన పశువులు 90 శాతం మరణిస్తున్నాయన్నారు. దీని వలన పాడి ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు పాడి రైతు తీవ్రంగా నష్ట పోతున్నాడన్నారు. పాడి రైతుకి ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.850 ఖరీదు చేసే టీకా పూర్తి రాయితీతో ఉచితంగా వేస్తుందని తెలిపారు. కోటవురట్ల మండలానికి 3600 టీకాలు, మాకవరపాలెం 4,200, గొలుగొండ 1,800, రావికమతం 3,000, రోలుగుంట 3,600లు, చీడికాడ 3,600, వి.మాడుగులకు 5,400, నర్సీపట్నం మండలానికి 1,800 డోసులు వచ్చాయని, నెలాఖరు వరకు టీకాలు ఉచితంగా వేస్తారని ఆయన తెలిపారు.

## శాకంబరిగా దుర్గమ్మ



నర్సీపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం సందర్భంగా నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలలయంలో అమ్మవారు శాకంబరిగా ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాదేవిని కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి శాకంబరిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ఈశ్వరప్రసాద్‌కు అభినందన సభ

నర్సీపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): రోలుగంట మండలం కొండపాలెం ప్రధానోపాధ్యాయుడుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కొట్ల ఈశ్వరప్రసాద్‌కు ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా అభినందన సభ నిర్వహించారు. స్థానిక విష్ణుతేజ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, ఏపీటీఎఫ్ నాయకులు ఆదివారం ఈశ్వర ప్రసాద్, ఆయన భార్య శ్రీవిశాలను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఆయన అందించిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రోలుగుంట మండల అధ్యక్షుడు పి.రమణ, కార్యదర్శి రాము, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు డీజీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడికి తులసీ దళాల పూజ

మాకవరపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శ్రీకృష్ణ ఆలయంలో ఆదివారం తులసీ దళాల పూజను ఘనంగా నిర్వహించారు. సమరత సేవా సంఘం సభ్యులు 108 తులసీ దళాలతో పూజ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 200 మహిళలు పాల్గొన్నారు. అలాగే తామరం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు చేశారు.

## జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

నర్సీపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని కాంగ్రెస్ నేతలు ఘనంగా నిర్వహించారు. కొత్త వీధి-పెదబొడ్డేపల్లి రోడ్డులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, పట్టణ అధ్యక్షుడు నంగిన రమణ, నాయ కులు ఏబీఎల్ స్వామి, చిన్నబ్బాయి, పెట్ల రాజేశ్వరావు, సిద్ధ పాల్గొన్నారు.

## ఏఎంసీ మాజీ చైర్మన్ అబ్బారావు మృతి



అబ్బారావు (ఫైల్ ఫొటో)

నాతవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు (అబ్బారావు) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. నాతవరం మండలం వెన్నలపాలెం గ్రామానికి చెందిన అబ్బారావు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగారు. పార్టీ మండల అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం సేవలు అందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో 2014 నుంచి 2016 వరకు నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్‌గా పని చేశారు. ఆయన మృతికి స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంతాపం వ్యక్తం చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కష్టపడి పని చేశారని పేర్కొన్నారు. పార్టీకి ఆయన లేని లోటు తీరనది అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే తాండవ చైర్మన్ కరక సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు తదితరులు అబ్బారావుకు సంతాపం తెలిపారు.

## లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నర్సీపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. బలిఘట్టం లయన్స్ క్లబ్ కమ్యూనిటీ హాల్‌లో అధ్యక్షుడిగా కె.సతీష్, కార్యదర్శిగా సీహెచ్.తారకరామారావు, ట్రెజరర్‌గా బి.సీతారామశర్మ ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే మెగా రక్తదాన శిబిరం, వైద్య శిబిరం, మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాపర్స్‌కి పుస్తకాలు, నగదు పురస్కారాలు ఇవ్వాలని, ప్లాస్టిక్ నిషేధం కోసం కృషి చేయాలని నూతన కార్యవర్గం ప్రతినిధులు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు బి.చక్రపాణిరాజు, డాక్టర్ మహేశ్, డాక్టర్ అధికార గోపాలరావు, డాక్టర్ యక్కలరామకృష్ణ, ఎం.రఘురామ్, దస్త్రాల రాఘవేంద్రరావు, డాక్టర్ మారుతీకృష్ణ పాల్గొన్నారు.

## వైభవంగా రాములోరి విగ్రహాల ఊరేగింపు



సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ, జూలై 6 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా సీతారాములవారి విగ్రహాలు ఊరేగింపు కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. గొలుగొండ, జానకిరాంపురం, పాకలపాడు, పుత్తడి గైరంపేట, రావణాపల్లి, చీడిగుమ్మల, గుండుపాల గ్రామాల్లో సీతారాములవారి ఉత్సవ విగ్రహాలను ఉరేగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బెన్నవోలులో ఎమ్మెల్యే రాజుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు



బుచ్చయ్యపేట: ఉప్పరగూడెంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

## హామీలు నెరవేరుస్తున్నాం.... ఆదరించండి: ఎమ్మెల్యే రాజు

చోడవరం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఇచ్చిన హామీలు నెరవేర్చిన కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలోని బెన్నవోలులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు, సంక్షేమ పథకాల వివరాలను గ్రామస్థులకు వివరించారు. ప్రజల ఆదరణతో నే ఇదే స్థాయి సుపరిపాలన సంక్షేమం సాధ్యమని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు గవర కార్పొరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు గూనూరు మల్లునాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ నాయకులకు ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు గౌరీశంకర్ ఆధ్వర్యంలో సాదరస్వాగతం పలికారు.

**బుచ్చెయ్యపేట:** మండలంలో ఉప్పరగూడెం గ్రామంలో ఆదివారం సుపరిపాలనలో తొలి ఆడుగు కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి పార్లమెంటరీ బీసీ విభాగం కోఆర్డినేటర్ గుర్రం నూకరాజు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాదిలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్, ఆగస్టునుంచి ఉచిత బస్సు తదితర పథకాలను అమలు చేస్తుందన్నారు. గ్రామస్థులు వాటర్ ట్యాంక్ సమస్య వివరించారు.ఈ సమస్య ఎమ్మెల్యే రాజు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుర్రం లక్ష్మి, పాపారావు, రామకృష్ణ, నక్క రామకృష్ణ, దొంగబాబు, గుర్రం దేముడు పాల్గొన్నారు.

## విత్తన శుద్ధితో తెగుళ్లు దూరం



అవగాహన కల్పిస్తున్న మండల ఇన్‌చార్జి

రావికమతం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల తెగుళ్లు ఆశించవని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గుణవతి తెలిపారు. రావికమతం గంజి వారి కల్లాల వద్ద ఆదివారం ప్రకృతి సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వరి విత్తనాలను పోసే ముందు బీజామృతంతో విత్తన శుద్ధి చేయించారు. ప్రకృతి సాగు తక్కువ ఖర్చుతో సాధ్యమన్నారు. ప్రకృతి సాగు పంటలకు మార్కెట్‌లోగిరాకీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి ఇంటర్నెట్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ జి. సన్యాసినాయుడు, దొరబాబు, లావణ్య, స్వాతిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

## నేడు ప్రధానోపాధ్యాయుల సమావేశం

మాడుగుల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల పదో తేదిన జరిగే మెగా పెరెంట్స్ డే పురస్కరించుకుని సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక రావిచెట్టు జంక్షన్ ఎంపీపీ పాఠశాల (గెడ్డబడి)లో మండలంలోని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల తోసమావేశం నిర్వహించనున్నట్టు ఎంఈవో బి. దేముడమ్మ తెలిపారు. మెగా పేరెంట్స్ డే నిర్వహణపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రతీ ఒక్కరూ విధిగా హాజరు కావాలని ఆమె కోరారు.

# పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరి



మాడుగులలో వ్యాక్సిన్లు వేస్తున్న వైద్యాధికారి నూకేశ్వరరావు



రోలుగుంటలో..

రోలుగుంట, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పెంపుడు శునకాలకు విధిగా యాంటీ ర్యాబిస్ టీకాలు వేయించి జంతు సంక్రమిత వ్యాధులను నిరోధించాలని స్థానిక పశువైద్యాధికారి నూకేశ్వరరావు కోరారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచిత రేబిస్ నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ బుధవారం ఆసుపత్రిలో ఈ టీకాలు వేస్తున్నామని, ప్రస్తుతం 600 డోసులు అందుబాటులో ఉన్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజేశ్వరి, అన్నపూర్ణ, శివ, రాజు, యశోద పాల్గొన్నారు.

**దేవరాపల్లి:** స్థానిక పశు వైద్యాధికారి జి.గాయత్రీదేవి 15 కుక్కలకు టీకాలు వేశారు. పెంపుడు కుక్కలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె సూచించారు. జంతువులనుంచి మనుషులకు వ్యాపించే రాబీస్, బ్రుసెల్లా, టీబీ, స్వైన్‌ఫ్లూ తదితర వ్యాధుల రాకుండా టీకాలు వేయించాలని సూచించారు. సిబ్బంది సురేశ్, ఎర్రిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

### 161 కుక్కలకు టీకాలు

మాడుగుల: స్థానిక పశు వైద్య కేంద్రంలో ఏరియా పశువైద్య సహాయ సంచాలకులు వి. చిట్టినాయుడు పెంపుడు కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాడుగులలో -47, కేజే పురంలో 38, ఎం కోడూరులో 46, కింతలి వల్లాపురంలో 38 కుక్కలకు ఈ టీకాలు వేసినట్టు చెప్పారు. ఈ నెల 14వ తేదీ వరకు పశుగ్రాస వారోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

**చీడికాడ:** పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్ ఎంతో అవసరమని జైతవరం పశుసంవర్ధకశాఖ సహాయకులు ఎం.శ్రీనివాసరావు అన్నారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్లు వేశారు.



కుక్క పిల్లకు రేబిస్ టీకా వేస్తున్న దృశ్యం

## పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలి

నర్సీపట్నం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేయించాలని పశు సంవర్ధ శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ డబ్ల్యూ.రాంబాబు సూచించారు. అంతర్జాతీయ జూనోసిస్ డే సందర్భంగా పశు సంవర్ధ శాఖ నర్సీపట్నం ఏరియా పశువుల ఆస్పత్రిలో పెంపుడు కుక్కలకు ర్యాబీస్ నిరోధక టీకాలు వేశారు. ఆదివారం 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ర్యాబీస్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా 115 పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబీస్ నిరోధక టీకాలు వేసినట్టు ఏడీ రాంబాబు చెప్పారు. జూనోటిక్ వ్యాధులు జంతువల నుంచి మానవులకు, మానవుల నుంచి జంతువులకు సంక్రమిస్తాయని తెలిపారు. పెంపుడు కుక్కలకు క్రమం తప్పకుండా ప్రతీ సంవత్సరం టీకా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యులు దుర్గాప్రసాద్, నరేశ్, పుష్ప, యమున, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

అనకాపల్లి టౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని కొత్తూరు జంక్షన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడినట్టు ట్రాఫిక్ ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. కశింకోట మండలం కన్నూరుపాలెంకు చెందిన ఆర్‌పి నాయుడు తన భార్య పద్మ, కుమారుడు నీరజ్‌తో పట్టణంలోని షాపింగ్‌కు వచ్చి తిరిగి వెళ్తుండగా అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న ద్విచక్ర వాహన చోదకుడు ఢీకొన్నాడన్నారు. ఈ సంఘటనలో భార్యభర్తలకు స్వల్ప గాయాలు, కాగా చిన్నారి నీరజ్‌కు తల నుదుట భాగంలో తీవ్ర గాయమైందన్నారు. నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

## గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య



మృతుడు సతీశ్ (ఫైల్ ఫొటో)

నక్కపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక హెటిరో ఔషధ పరిశ్రమలో పనిచేస్తున్న జంగారెడ్డిగూడేనికి చెందిన ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఆదివారం నక్కపల్లి హెచ్‌సీ వెంకటరావు విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడేనికి చెందిన చింతాకుల సతీశ్ (22) హెటిరోలో కాంట్రాక్టు వెల్డర్‌గా పనిచేస్తున్నాడని, ఉపమాకలో తల్లి మంగ, కుటుంబ సభ్యులతో ఉంటున్నాడని పేర్కొన్నారు. సతీశ్‌కు మద్యం అలవాటు ఉన్నందున ఈ నెల 3న తల్లి మందలించడంతో రాత్రి మేడ మీదకు వెళ్లి గడ్డిమందు తాగాడని తెలిపారు. మేడపై వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు తక్షణమే సతీశ్‌ను నక్కపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం కేజీహెచ్‌కు తరలించగా, శనివారం రాత్రి మృతి చెందినట్టు హెచ్‌సీ పేర్కొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జనసేన నేతలు



పీవీ మాధవ్‌ని కలసిన ఆడపా నర్సింహమూర్తి

బుచ్చెయ్యపేట జూలై 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పీవీ మాధవ్‌ను జనసేన నేత ఆడపా నర్సింహమూర్తి, తదితరులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు. ఈ సందర్భంగా చోడవరం నియోజకవర్గంలోని సమస్యలు వివరించారు. ఆయనతోపాటు గంటికొర్లం మాజి సర్పంచ్ శనివాడ నాయుడుబాబు తదితరులు కలిశారు.

## సాగునీటి కాలువలో పూడిక తొలగింపు



సాగునీటి కాలువలో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

చీడికాడ, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కోనాం జలాశయం పరిధి ఆయకట్టుకు ఖరీఫ్‌లో సకాలంలో సాగునీరందించేకు కాలువల్లో షిల్ట్ తొలగిస్తున్నామని మర్లగుమ్మి చానల్ దిబ్బపాలెం కాలువ నీటి సంఘం అధ్యక్షులు దారపు మండేలు తెలిపారు. మండలంలో బైలపూడి నుంచి దిబ్బపాలెం వెళ్లే సాగునీటి కాలువలో ఉపాధి పథకం నిధులతో షిల్ట్‌ను ఆదివారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ షిల్టు పేరుకుపోవడంతో ఉపాధి పథకం అధికారులు నిధులు మంజూరు చేశారని అన్నారు. ఇప్పటికి గత 15రోజులుగా కాలువలో షిల్టును తొలగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, రైతులు కష్టపడి పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీఆర్పీ చిన్నంనాయుడు పాల్గొన్నారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



సోములు మృతదేహం

దేవరాపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అనాథ సోములు (85) మృతి చెందారు. ఎక్కడి నుంచో చాలా ఏళ్ల కిందట వచ్చిన సోములు కట్టెలు కొట్టి అమ్ముకుని జీవించేవాడు. వృద్ధాప్యంతో పనులు చేసుకోలేకపోవడంతో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు అతనికి పింఛన్ మంజూరు చేయించారు. అప్పటి నుంచి ఆ సొమ్ముతో పాటు ఆల యాల వద్ద ఉంటూ సోములు జీవనం సాగించేవాడు. శనివారం రాత్రి ఆటో స్టాండు వద్ద చని పోవడంతో ఆదివారం ఉదయం వరకు చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు సూచనల మేరకు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు శారదానది ఒడ్డున ఖననం చేశారు.